




RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక








ప్రచురణ : తెలంగాణ | సంపుటి 01 | సంచిక 160 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | గురువారం - 30 - జులై - 2026 | వెల రూ. 5 /-




# ఇకపై 'వందేమాతరం'ను అవమానిస్తే జైలుకే..

## - రాజ్యసభలో బిల్లుకు ఆమోదం

- ప్రస్తుతం జాతీయ జెండా, జాతీయ గీతానికి ఉన్న చట్టపరమైన రక్షణ
- తాజాగా వందేమతరానికీ దాని విస్తరణ
- బిల్లును సమర్థించిన కేంద్రం
- రాష్ట్రపతి ఆమోదం తర్వాతే చట్టం
- సభలో ప్రతిపక్షాల ఆందోళన, వాకౌట్



**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** జాతీయ గేయం 'వందేమాతరం'ను ఉద్దేశపూర్వకంగా అవమానించడాన్ని శిక్షార్హ నేరంగా ప్రకటించే 'జాతీయ గౌరవానికి అవమాన నిరోధక (సవరణ) బిల్లు–2026'కు రాజ్యసభ బుధవారం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం జాతీయ జెండా, జాతీయ గీతానికి ఉన్న చట్టపరమైన రక్షణను ఇకపై వందేమాతరానికీ వర్తింపజేయనున్నారు. బిల్లుపై సుదీర్ఘ చర్చ అనంతరం ఎగువ సభ దీన్ని ఆమోదించింది. బిల్లుపై చర్చ సందర్భంగా సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు రావాలని ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. ఆప్, కాంగ్రెస్, సీపీఎం సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేయగా, అనంతరం ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఇరు పక్షాల సభ్యులు తమ అభిప్రాయాలు వెల్లడించిన తర్వాత కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా నిత్యానంద్ రాయ్ మాట్లాడుతూ, 1971లో జాతీయ చిహ్నాల పరిరక్షణ కోసం ఈ చట్టాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు అదే రక్షణను వందేమాతరానికీ విస్తరిస్తున్నామని చెప్పారు. బంకించంద్ర చటర్జీ 1875లో ఈ గీతాన్ని రచించారని, 1896 కాంగ్రెస్ సమావేశంలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఆలపించారని వివరించారు. స్వాతంత్ర్య సమరయోధులు చివరి క్షణాల్లో కూడా 'వందేమాతరం' నినాదం చేశారని గుర్తుచేశారు. ఈ బిల్లును వ్యతిరేకించడం జాతీయ నాయకుల భావాలకు విరుద్ధమని మంత్రి వ్యాఖ్యానించారు. దేశ ఐక్యత, జాతీయ భావనను బలోపేతం చేయడమే ఈ చట్టం ఉద్దేశమని చెప్పారు. దర్యాప్తు, చర్చల అనంతరం ప్రతిపక్షం వాకౌట్ చేసిన నేపథ్యంలో రాజ్యసభ బిల్లును ఆమోదించింది. ఇక ఈ బిల్లు చట్టంగా మారాలంటే రాష్ట్రపతి ఆమోదం పొందాల్సి ఉంది.

# సంక్షేమ పథకాలకు, ఓటర్ల జాబితా సవరణకు సంబంధం లేదు

## - తెలంగాణ సీఈఓ



- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష
- ఆగస్టు 3 నాటికి 100 శాతం డిజిటైజేషన్ పూర్తి చేయాలని ఆదేశం
- పట్టణ ప్రాంతాల్లో ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచన
- ఒకే కుటుంబం ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలని ఆదేశం

2

# పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం..

## లోక్‌సభలో పరీక్షల సవరణ బిల్లుకు ఆమోదం



- పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు 2026కు లోక్‌సభ ఆమోదం
- పరీక్షల అక్రమాలకు పాల్పడితే 10 ఏళ్ల జైలు, రూ.10 కోట్ల వరకు జరిమానా
- ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు.. మూడు నెలల్లోగా తీర్పు.
- నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థుల నిరసనలు, మంత్రి రాజీనామా నేపథ్యంలో ఈ పరిణామం

2

# మన్మోహన్ సింగ్ పై ఉన్న క్రిమినల్ కేసును శాశ్వతంగా క్లోజ్ చేసిన సుప్రీంకోర్టు



2

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి 14 రోజుల రిమాండ్..

# చంచల్‌గూడ జైలుకు తరలింపు



- ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపుల కేసు
- ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణ రెడ్డికి ఆగస్టు 11 వరకు రిమాండ్
- చంచల్‌గూడ జైలుకు తరలించిన పోలీసులు
- తమది ఇద్దరి అంగీకారంతో కూడిన సంబంధమని నిందితుడి వాదన

2

# ఒక అధికారికి ఒకే ప్రభుత్వ వాహనం..

## - కేంద్రం కొత్త ఆదేశాలు




- అదనపు బాధ్యతలున్నా రెండో కారు ఇవ్వొద్దని స్పష్టీకరణ
- ప్రభుత్వ వనరుల దుర్వినియోగం, వృథా ఖర్చులను అరికట్టడమే లక్ష్యం
- పీఎస్‌యూల వాహనాలను సొంత పనులకు వాడొద్దని అధికారులకు సూచన
- వినియోగంలో లేని వాహనాలను సురక్షితంగా ఉంచాలని శాఖలకు ఆదేశం

2

## తెలంగాణలో నిరుద్యోగులకు గుడ్ న్యూస్..

# 7,437 ఉద్యోగాలకు నోటిఫికేషన్




- తెలంగాణలో పోలీసు, ఫైర్, జైళ్ల శాఖల్లో భారీగా ఖాళీల భర్తీ
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ, తేదీలు త్వరలో ప్రకటన
- దరఖాస్తుకు ముందే వైద్య పరీక్షలు చేయించుకోవాలని అభ్యర్థులకు సూచన

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణలోని నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 7,437 పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి (TSLPRB) బుధవారం నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లను జారీ చేసింది. పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (SPF), ఫైర్ అండ్ డిజాస్టర్ రెస్పాన్స్, జైళ్లు, కరెక్షనల్ సర్వీసెస్ విభాగాల్లో ఈ నియామకాలు చేపట్టనున్నారు. ఈ మేరకు టీఎస్ఎల్‌పీఆర్‌బీ ఛైర్మన్ ....

2

# బొగత ఉగ్రరూపం

## - సందర్శన నిలిపివేత



- వాయుగుండం ప్రభావంతో ఉత్తర తెలంగాణలో భారీ వర్షాలు
- ఉద్ధృతంగా ప్రవహిస్తున్న బొగత జలపాతం
- పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని చర్యలు చేపట్టిన అధికారులు

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణలోని ఉత్తర జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో ములుగు జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న కుండపోత వర్షాలకు ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన బొగత జలపాతం ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. గత 10 గంటలుగా అటవీ ప్రాంతంలో వర్షం నిరంతరాయంగా కురుస్తుండటంతో ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరి జలపాతం ఉగ్రరూపం దాల్చింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో, పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి వద్ద ఉన్న బొగత జలపాతం సందర్శనను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. వరద ఉద్ధృతికి రాళ్లు జారే ప్రమాదం ఉండటంతో పాటు ప్రవాహం ఒక్కసారిగా పెరిగే అవకాశమున్నందున పర్యాటకులు ఎవరూ జలపాతం వైపు రావొద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జలపాత పరిసర ప్రాంతాల్లో భద్రతను పెంచినట్లు తెలిపారు. వరద తగ్గి పరిస్థితి అదుపులోకి వచ్చేవరకు పర్యాటకులు పోలీసులు, అటవీ శాఖ అధికారుల ఆదేశాలను పాటించాలని సూచించారు.

నేటి శుభోదయ
గురువారం | హైదరాబాద్
30 - 07 - 2026
www.netisubhodaya.com



# మన్మోహన్ సింగ్ పై ఉన్న క్రిమినల్ కేసును శాశ్వతంగా క్లోజ్ చేసిన సుప్రీంకోర్టు

**మొదటిపేజీ తరువాయి..** బొగ్గు గనుల కేటాయింపు వ్యవహారంలో దివంగత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌పై నమోదైన క్రిమినల్ కేసును, ఆనాటి ప్రత్యేక కోర్టు జారీ చేసిన సమన్ల ఉత్తర్వులను సుప్రీంకోర్టు ఈరోజు పూర్తిగా రద్దు చేసింది. విచారణ సంస్థల ఆధారాలను తోసిపుచ్చి స్పెషల్ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను కొట్టివేస్తూ కేసును క్లోజ్ చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. ఈ కేసుకు సంబంధించి సీబీఐ దాఖలు చేసిన రెండు విభిన్న క్లోజర్ రిపోర్టుల్లో మన్మోహన్ సింగ్‌కు క్లీన్ చిట్ ఇచ్చిందని, అయినప్పటికీ ట్రయల్ కోర్టు సీబీఐ నివేదికను పక్కనబెట్టి సమన్లు జారీ చేయడంలో ఎలాంటి బలమైన కారణాలు కనిపించడం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

**కేసు నేపథ్యం ...**
2005లో ఒడిశాలోని తలబిరా–II బొగ్గు బ్లాక్ కేటాయింపుల విషయంలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలతో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, ప్రముఖ పారిశ్రామికవేత్త కుమార మంగళం బిర్లా, మాజీ బొగ్గు శాఖ కార్యదర్శి పి.సి. పరాఖ్‌లకు 2015లో నాటి ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను మన్మోహన్ సింగ్ సుప్రీంకోర్టులో సవాలు చేయగా, అత్యున్నత న్యాయస్థానం ఆనాడే సమన్ల అమలుపై స్టే విధించింది. ప్రధానిగా తన విధుల్లో భాగంగా నిర్ణయం తీసుకున్నానని, ఇందులో ఎలాంటి నేర పూరిత ఉద్దేశం లేదని మన్మోహన్ సింగ్ స్పష్టం చేశారు. తాజాగా సీబీఐ అందించిన క్లోజర్ రిపోర్టును ఆమోదిస్తూ సుప్రీంకోర్టు తుది తీర్పునివ్వడంతో మాజీ ప్రధానిపై ఉన్న ప్రధాన ఆరోపణలు తొలగిపోయాయి.

# ఒక అధికారికి ఒకే ప్రభుత్వ వాహనం..
## - కేంద్రం కొత్త ఆదేశాలు

**మొదటిపేజీ తరువాయి..** ప్రభుత్వ వనరుల దుర్వినియోగం, వృథా ఖర్చులకు కళ్లెం వేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై అర్హులైన ఒక అధికారికి ఒకే ప్రభుత్వ వాహనాన్ని కేటాయించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని వ్యయ విభాగం 'ఒక అధికారికి–ఒకే కారు' విధానాన్ని అమల్లోకి తెస్తూ అధికారిక మెమొరాండం జారీ చేసింది. ప్రభుత్వ వాహనాలను కేవలం అధికారిక ప్రయోజనాల కోసమే వినియోగించేలా చూడటమే ఈ చర్య ముఖ్య ఉద్దేశం. కొత్త నిబంధనల ప్రకారం, ఇప్పటికే ప్రభుత్వ వాహన సదుపాయం పొందుతున్న అధికారికి.. వేరే మంత్రిత్వ శాఖ, ప్రభుత్వ రంగ సంస్థ లేదా ఇతర స్వయంప్రతిపత్తి సంస్థల్లో అదనపు బాధ్యతలు అప్పగించినప్పటికీ, రెండో వాహనాన్ని కేటాయించకూడదని స్పష్టం చేసింది. సదరు అధికారి తన వద్ద ఉన్న వాహనాన్నే ఆ అదనపు బాధ్యతల నిర్వర్తణకు కూడా ఉపయోగించుకోవాలని ఆదేశాల్లో పేర్కొంది. ఈ విషయంలో ఎలాంటి మినహాయింపులు ఇవ్వొద్దని అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలను ఆదేశించింది. కేవలం వాహనాల సంఖ్యకే ఈ నిబంధనలు పరిమితం కాలేదు. ప్రభుత్వ రంగ సంస్థలు, స్వయంప్రతిపత్తి లేదా పాక్షిక–ప్రభుత్వ సంస్థలకు చెందిన వాహనాలను కేంద్ర ప్రభుత్వ అధికారులు వినియోగించడాన్ని కూడా నిషేధించింది. అయితే, అధీకృత అధికారిక పర్యటనలు లేదా విధుల్లో భాగంగా ప్రయాణించేటప్పుడు మాత్రం మినహాయింపు ఇచ్చింది. ఈ చర్యల ప్రధాన ఉద్దేశం పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడం, వనరుల దుర్వినియోగాన్ని అరికట్టడం, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణను మెరుగుపరచడమని ప్రభుత్వం తెలిపింది. వినియోగంలో లేని లేదా మిగులుగా ఉన్న వాహనాలను అనధికారిక పనులకు వాడకుండా వాటిని సురక్షితంగా భద్రపరచాలని కూడా శాఖలకు సూచించింది. పన్ను చెల్లింపుదారుల సొమ్మును బాధ్యతాయుతంగా ఖర్చు చేయడమే తమ లక్ష్యమని పేర్కొంది. 2022 సెప్టెంబర్‌లో ప్రభుత్వ వాహనాల వినియోగంపై జారీ చేసిన సమగ్ర మార్గదర్శకాలకు అనుబంధంగా ఈ తాజా ఆదేశాలు వచ్చాయి. ఆర్థిక క్రమశిక్షణను బలోపేతం చేయడంలో భాగంగా ఈ సవరించిన నిబంధనలను కఠినంగా పాటించాలని అన్ని కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలను వ్యయ విభాగం ఆదేశించింది.

# తెలంగాణలో నిరుద్యోగులకు గుడ్ న్యూస్..
## 7,437 ఉద్యోగాలకు నోటిఫికేషన్

**మొదటిపేజీ తరువాయి..**
వి.వి. శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు.

**విభాగాల వారీగా ఖాళీల వివరాలు**
తాజా నోటిఫికేషన్ల ప్రకారం, అత్యధికంగా పోలీసు శాఖలోనే పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో 3,697 సివిల్ కానిస్టేబుల్, 1,052 ఆర్మ్‌డ్ రిజర్వ్ (AR) కానిస్టేబుల్ పోస్టులు ఉన్నాయి. వీటితో పాటు 148 సివిల్ సబ్–ఇన్‌స్పెక్టర్లు (SI), 14 రిజర్వ్ ఎస్సై (AR), 12 రిజర్వ్ ఎస్సై (TGSP), 3 రిజర్వ్ ఎస్సై (SARCPL), 23 అసిస్టెంట్ ఎస్సై (FPB), 24 పోలీస్ కానిస్టేబుల్ (SARCPL), 20 పోలీస్ కానిస్టేబుల్ డ్రైవర్ (PTO), 7 పోలీస్ కానిస్టేబుల్ మెకానిక్ (PTO) పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు. రెండో నోటిఫికేషన్ కింద స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (SPF) విభాగంలో 1,380 కానిస్టేబుల్, 44 ఎస్సై పోస్టులను భర్తీ చేయబోతున్నారు. ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ & సివిల్ డిఫెన్స్ విభాగంలో 751 ఫైర్ ఫైటర్లు, 39 స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. ఇక జైళ్లు, కరెక్షనల్ సర్వీసెస్ విభాగంలో 14 డిప్యూటీ జైలర్ (పురుషులు), ఒక డిప్యూటీ జైలర్ (మహిళ), 196 వార్డర్ (పురుషులు), 12 వార్డర్ (మహిళ) ఖాళీలను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు.

**అభ్యర్థులకు కీలక సూచనలు**
ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు సంబంధించిన తేదీలను త్వరలోనే వెల్లడిస్తామని టీఎస్ఎల్‌పీఆర్‌బీ ఛైర్మన్ వి.వి. శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు నోటిఫికేషన్లలోని వివరాలను క్షుణ్ణంగా చదివి, అర్హతలను నిర్ధారించుకున్న తర్వాత అధికారిక వెబ్‌సైట్ tgprb.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా, అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే ముందే సివిల్ సర్జన్‌తో వైద్య పరీక్షలు చేయించుకుని, తాము నిర్దేశిత శారీరక, వైద్య ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నామో లేదో నిర్ధారించుకోవాలని ఆయన హితవు పలికారు. దీనివల్ల తదుపరి దశలో నిరాశకు గురికాకుండా ఉండవచ్చని స్పష్టం చేశారు.

# సంక్షేమ పథకాలకు, ఓటర్ల జాబితా సవరణకు సంబంధం లేదు - తెలంగాణ సీఈఓ

**మొదటిపేజీ తరువాయి..** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు, ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు ఎలాంటి సంబంధం లేదని తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. తప్పులు లేని కచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే ఈ కార్యక్రమం యొక్క ఏకైక లక్ష్యమని ఆయన వివరించారు. బుధవారం ఆయన జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఫారాల సమర్పణకు మరో ఐదు రోజులే గడువు ఉన్నందున, ఆగస్టు 3వ తేదీ నాటికి 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 76 శాతం డిజిటలైజేషన్ పూర్తి కాగా, గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రక్రియ 90 శాతానికి చేరిందని తెలిపారు. ఖానాపూర్, బాలకొండ, ఎల్లారెడ్డి, హుజూర్ నగర్, నర్సంపేట, వర్ధన్నపేట, పరకాల, బోథ్ నియోజకవర్గాల్లో 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసిన అధికారులను ఆయన అభినందించారు. శేరిలింగంపల్లి, రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం వంటి పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎన్నికల అధికారులకు సూచించారు. ఓటరు వివరాలను అప్‌లోడ్ చేసే సమయంలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), సూపర్ వైజర్లు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరినీ ఒకే పోలింగ్ కేంద్రానికి కేటాయించాలని, అలాగే మరణించినా లేదా చిరునామా మారిన ఓటర్ల జాబితాను సిద్ధం చేసేటప్పుడు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్ల సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని సీఈఓ స్పష్టం చేశారు.

# పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం..
## లోక్‌సభలో పరీక్షల సవరణ బిల్లుకు ఆమోదం

**మొదటిపేజీ తరువాయి..** దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన పరీక్షల పేపర్ లీకేజీలు, అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. ఇందులో భాగంగా 'పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు–2026'కు లోక్‌సభ బుధవారం ఆమోదముద్ర వేసింది. రెండు రోజుల పాటు వాడివేడిగా సాగిన చర్చల అనంతరం వాయిస్ ఓటు ద్వారా ఈ కీలక బిల్లును సభ ఆమోదించింది. పరీక్షల వ్యవస్థలో పారదర్శకతను పెంచడం, విద్యార్థుల భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా ఈ చట్టాన్ని తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. 2024 నాటి చట్టానికి సవరణలు చేస్తూ రూపొందించిన ఈ కొత్త బిల్లులో అత్యంత కఠినమైన నిబంధనలను చేర్చారు. దీని ప్రకారం పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే దోషులకు గరిష్ఠంగా 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అంతేగాక దోషుల ఆస్తులను జప్తు చేసే అధికారాన్ని కూడా ఈ చట్టం కల్పిస్తుంది. ఈ తరహా కేసుల విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయనున్నారు. ఈ కోర్టులు మూడు నెలల వ్యవధిలోనే విచారణ పూర్తి చేసి తీర్పు వెలువరించాల్సి ఉంటుంది. ఇటీవల నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా కఠినమైన చట్టం తీసుకువస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ఆ తర్వాత కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. నీట్ అక్రమాలు, ఇతర పరీక్షల్లో అవకతవకలపైన జులై 20న 'కాక్‌రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీలో 'సంసద్ చలో' పేరిట వందలాది మంది విద్యార్థులు భారీ నిరసన చేపట్టారు. ఈ ఆందోళన హింసాత్మకంగా మారడంతో పోలీసులు, నిరసనకారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జులై 25న తన పదవికి రాజీనామా చేశారు. ఈ రాజకీయ ఒత్తిడి, దేశవ్యాప్త నిరసనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన చట్టాన్ని తీసుకురావడం గమనార్హం.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి 14 రోజుల రిమాండ్..
## - చంచల్‌గూడ జైలుకు తరలింపు

**మొదటిపేజీ తరువాయి..** ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో అరెస్టయిన ట్రైనీ ఐపీఎస్ ఎం. ఉదయ్ కృష్ణారెడ్డికి న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. మంగళవారం అరెస్టయిన ఆయన్ను పోలీసులు బుధవారం ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన న్యాయమూర్తి, ఆగస్టు 11 వరకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఉదయ్‌ను చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో తనతో పాటు శిక్షణ పొందుతున్న 30 ఏళ్ల మహిళా అధికారిణిని లైంగికంగా వేధించాడని ఉదయ్‌పై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. పదే పదే లైంగిక వేధింపులకు గురిచేయడం, వాట్సాప్‌లో అసభ్యకర సందేశాలు పంపడం, వెంటపడడడం (స్టాకింగ్), అక్రమంగా నిర్బంధించడం, శారీరకంగా దాడి చేసి బెదిరింపులకు పాల్పడటం వంటివి ఫిర్యాదులో ఉన్నాయి. అంతేకాకుండా, రహస్యంగా ప్రైవేట్ వీడియో తీసి, దానిని ఆమె భర్తకు పంపి బ్లాక్‌మెయిల్ చేశారని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈనెల 18న బాధితురాలి ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఐటీ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద లైంగిక వేధింపులు, మహిళ పట్ల నేరపూరిత బలప్రయోగం, గోప్యతకు భంగం కలిగించడం, అశ్లీల సమాచారాన్ని ప్రసారం చేయడం వంటి అభియోగాలతో కేసు నమోదు చేశారు. అరెస్టు అనంతరం పోలీసులు ఉదయ్‌ను అశోక్ నగర్‌లోని ఆయన నివాసానికి తీసుకెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసినట్లు సమాచారం. మరోవైపు, తనపై వచ్చిన ఆరోపణలన్నీ అవాస్తవమని, న్యాయవ్యవస్థపై తనకు నమ్మకం ఉందని ఉదయ్ కృష్ణారెడ్డి ఇటీవల సోషల్ మీడియా ద్వారా తెలిపారు. బాధితురాలితో తనకు ఏడాదిగా (2025 జూన్ 2025) సంబంధం ఉందని, ఆమెకు వివాహం జరిగిన తర్వాత కూడా అది కొనసాగిందని ఆయన వాదిస్తున్నారు. తమ సంబంధం ఇద్దరి అంగీకారంతోనే జరిగిందని నిరూపించడానికి తన వద్ద ఫొటోలు, వీడియోల రూపంలో ఆధారాలున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈనెల 21న మోతీనగర్‌లోని బంధువుల ఇంట్లో అపస్మారక స్థితిలో కనిపించడంతో ఆయనను ఆసుపత్రిలో చేర్చారు. ఇది ఆత్మహత్యాయత్నమని ప్రచారం జరిగినా, సానుభూతి కోసమే ఇలా చేసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాక ఆయన అదృశ్యమయ్యారని వార్తలు వచ్చాయి. అయితే, తనపై ఆరోపణలు రావడంతో అనారోగ్యం పాలైన నాయనమ్మను చూసేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఉళ్లపాలెం వెళ్లానని, తాను పారిపోలేదని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ తిరిగి వస్తుండగా మంగళవారం నాడు పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా, తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ ఉదయ్ కృష్ణారెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, ఈ కేసులో బాధితురాలికి ఇంకా నోటీసులు జారీ చేయలేదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు కోర్టుకు తెలపడంతో, విచారణను హైకోర్టు వాయిదా వేసింది.

# ఈ వాహనాల్లో చిన్న మార్పులు అవసరం..
## - ఈ20 పెట్రోల్‌పై కేంద్రం కీలక ప్రకటన

**మొదటిపేజీ తరువాయి..** ఈ20 పెట్రోల్ తో వాహనాలకు ఎలాంటి ఇబ్బంది లేదని చెబుతూ వస్తున్న కేంద్రం తాజాగా కీలక ప్రకటన చేసింది. ఈ20 వాడాలంటే 2016కు ముందు తయారైన కొన్ని వాహనాల్లో మాత్రమే స్వల్ప మార్పులు అవసరమవుతాయని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. ముఖ్యంగా 2005 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చిన బీఎస్–3 ప్రమాణాల వాహనాల్లోని కొన్ని రబ్బరు భాగాలు, గ్యాస్కెట్లను మార్చాల్సి రావచ్చని రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. సాధారణ సర్వీసింగ్‌లోనే ఈ మార్పులు చేయవచ్చని స్పష్టం చేశారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, డెహ్రాడూన్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం, సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మ్యానుఫ్యాక్చరర్స్, ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన అధ్యయనాల్లో కార్లు, ద్విచక్ర వాహనాల ఇంజిన్లలో ఎలాంటి మార్పులు అవసరం లేదని తేలిందని మంత్రి చెప్పారు. ఈ20 పెట్రోల్‌తో పాత వాహనాల పనితీరులో గణనీయమైన మార్పులు లేదా అసాధారణ అరుగుదల కనిపించలేదని వెల్లడించారు. డ్రైవింగ్ సామర్థ్యం, స్టార్ట్ అయ్యే విధానం, లోహ భాగాలు, ప్లాస్టిక్ భాగాల పనితీరు వంటి అంశాల్లో కూడా ఎలాంటి సమస్యలు గుర్తించలేదని గడ్కరీ తెలిపారు. ఈ20 పెట్రోల్ వాడటం వల్ల మైలేజ్ తగ్గుతుందనే అభిప్రాయాన్ని కూడా ఆయన తోసిపుచ్చారు. వాహనం మైలేజ్ అనేది అనేక అంశాలపై ఆధారపడి ఉంటుందని, ఈ20 పెట్రోల్‌ను మాత్రమే కారణంగా చెప్పలేమని ఆటోమొబైల్ తయారీ సంస్థలు, పరీక్షా సంస్థలు స్పష్టం చేసినట్లు వివరించారు. 2020లో నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన అంతర్‌శాఖ కమిటీ ఇథనాల్ మిశ్రమ ఇంధనంపై సమగ్ర అధ్యయనం చేసి నివేదిక ఇచ్చిందని మంత్రి



తెలిపారు. ఇంజిన్ పనితీరు, ఇంధన వ్యవస్థ, మన్నిక, కాలుష్య ఉద్గారాలు, ఇంధన సామర్థ్యం వంటి అంశాలను పరిశీలించిన తర్వాతే ఈ20 పెట్రోల్‌ను దశలవారీగా అమలు చేశామని చెప్పారు. బ్రెజిల్ వంటి దేశాల్లో దశాబ్దాలుగా ఇంకా ఎక్కువ ఇథనాల్ మిశ్రమ ఇంధనాన్ని విజయవంతంగా వినియోగిస్తున్నారని గుర్తు చేశారు.

## కొండూరు తాత్కాలిక బ్రిడ్జి వద్ద నిలిచిన రాకపోకలు

### - ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని విజ్ఞప్తి







**నిజామాబాద్ రూరల్ సిరికొండ, జులై 29, నేటి శుభోదయ :** సిరికొండ మండలం లోని కప్పుల వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కొండూరు సమీపంలో ఉన్న తాత్కాలిక బ్రిడ్జి అంచులు కుంగిపోతున్నాయి. కురుస్తున్న వర్షపు నీటి తాకిడికి బ్రిడ్జికి వేసిన మొరం మట్టి కొట్టుకు పోవడంతో తీవ్ర ప్రమాదం పొంచి ఉందని అధికారులు హెచ్చరించారు.ఈ నేపథ్యంలో నిజామాబాద్ వైపు వెళ్లే వాహనదారులు ఎవరూ కొండూరు మార్గంలో రావద్దని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ మార్గంలో రాకపోకలను నిలి పివేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు మరియు వాహనదారులు అప్రమత్తంగా ఉండి, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకో వాలని కోరారు. ఈ దారి సిరికొండ మండలం లోని ముప్పై గ్రామాలకు నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్ళటానికి ముఖ్య మైనదిఅంతే కాకుండా రాజన్న సిరిసిల్ల జిల్లా లోని వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆల యానికి వెళ్లాలన్న ఈ బిడ్జి నుంచే ఇదే దారి వెంట ఈ మండలానికి ఎ ప్రభుత్వ అధికారి కానీ. ఎమ్ ఎల్ ఎ, ఎమ్ పి, కలెక్టర్, అన్ని ప్రభుత్వ అధికారులు వస్తుంటారు కానీ ఎవరికీ కనపడలేదా? ఈ పరిస్థితి రావడానికి కాంట్రాక్టర్లు. ప్రభుత్వ అధికారులు బాధ్యత వహించాలని ముందస్తుగానే అందరు అధి కారులకు ప్రత్యేకంగా పరోసాక్షంగా వినతి పత్రం రూపల్లో ఎన్ని సార్లు వారి కి విన్న వించిన ఎటువంటి చర్యలు తీసుకోలేకనే మల్లి మల్లి ఈ దుస్థితి వచ్చిందని ప్రజలు మండిపడ్డారు

## కప్పల వాగులో జలకళ

### - రైతాంగంలో నెలకొన్న ఆనందోత్సాహాలు





**నిజామాబాద్ రూరల్ సిరికొండ, జులై 29, నేటి శుభోదయ :** సిరికొండ మండలం లోనితుంల్లి, గ డ్కోల్, రాడుగు, కొండూరు, వాలాట్ గ్రామ పొలిమేరల్లో గత కొద్ది రోజులు గాకురుస్తున్న భారీ వర్షాలకు స్థానిక కప్పల వాగు భారీగ నీరు ప్రవహిస్తోంది. వాగులోకి వర్షం నీరు భారీగా వచ్చి చేరడంతో చెక్ డ్యామ్‌లు, చిన్న చిన్న కుంటలు నిండి జలకళ సంతరించుకున్నాయి.వాగు పొంగిపొర్లుతుం డటంతో పరివాహక ప్రాంతంలోని భూగర్భ జలాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని, బావులు, బోర్లలో నీటి మట్టం పెరుగుతుందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాలతో వ్యవసాయ పనులకు పుష్కలంగా నీరు అందుబాటులోకి రావడంతో వర్షాలు అనుకూలించి కప్పల వాగు కళకళలాడు తుండటంతో ఈ ఏడాది పంట దిగుబడులు బాగా వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వాగు పారుతున్న దృశ్యాలను చూసేందుకు స్థానికులు, రైతులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

## మున్నేరు చెక్‌డ్యామ్ కూల్చివేత కాంగ్రెస్ విధ్వంస పాలనకు నిదర్శనం

### : ఖమ్మం బీఆర్ఎస్ నేతలు

- **అభివృద్ధి విధ్వంసానికి పాల్పడిన మంత్రులు తుమ్మల, పొంగులేటి**



**ఖమ్మం, జులై 29, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలోని ప్రకాశ్‌నగర్ వద్ద మున్నేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేయడం ప్రజా ప్రయోజనాలను విస్మరించిన విధ్వంసకర పాలనకు నిదర్శనమని బీఆర్ఎస్ నేతలు విమ ర్శించారు. బుధవారం చెక్‌డ్యామ్ కూల్చివేసిన ప్రాంతాన్ని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సందర్శించి పరిస్థితిని పరిశీలించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చెక్‌డ్యామ్ కూల్చివేత కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, అనాలోచిత నిర్ణయాలు, ముందుచూపు లేని పాలనకు ప్రత్యక్ష ఉదాహరణ అని అన్నారు. కేసీఆర్ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనుల ఆనవాళ్లను చెరిపివేయాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని, ఖమ్మం జిల్లాలోని కాంగ్రెస్ మంత్రులు తుమ్మల, పొంగులేటి అదే విధానాన్ని అమలు చేస్తూ అభివృద్ధి విధ్వంసానికి పాల్ప డ్డారని ఆరోపించారు. ముఖ్యంగా ఖమ్మం నియోజకవర్గంలో ప్రజలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తులను ధ్వంసం చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా మారిందని విమర్శించారు.ఖమ్మం నగరానికి దీర్ఘకాలిక తాగునీటి భద్రత కల్పించాలనే లక్ష్యంతో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చొరవతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రకాశ్‌నగర్ వద్ద మున్నేరు వాగుపై సుమారు రూ.8 కోట్ల వ్యయంతో చెక్‌డ్యామ్ నిర్మించారని గుర్తు చేశారు. ఈ చెక్‌డ్యామ్ నిర్మాణం వల్ల మున్నేరు పరివాహక ప్రాంతంలో భూగర్భ జలమట్టం గణనీయంగా పెరిగి, నగర వ్యాప్తంగా నీటి లభ్యత మెరుగుపడ టంతో తాగునీటి సమస్యకు గణనీయమైన ఉపశమనం లభించిందని పేర్కొన్నారు.ప్రజల ప్రయోజనాలను పూర్తిగా పక్కనపెట్టి, ఎలాంటి ప్రత్యామ్నాయ కార్యాచరణ లేకుండానే రాజకీయ కక్షసాధింపు ధోరణితో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చెక్‌డ్యామ్‌ను పూర్తిస్థాయిలో కూల్చివేసిందని ఆరో పించారు. దీని ఫలితంగా భవిష్యత్తులో ఖమ్మం నగరం నీటి నిల్వలను కోల్పోయి తీవ్ర తాగునీటి సమస్యను ఎదుర్కొనే ప్రమాదం ఉందని, దీనికి కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.అలాగే, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చొరవతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ.525 కోట్ల వ్యయంతో మున్నేరుకు ఇరువైపులా 17 కిలోమీటర్ల మేర రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. దానవాయిగూడెం నాగార్జునసాగర్ కాలువ ప్రాంతం నుంచి ప్రకాశ్‌నగర్ బ్రిడ్జి వరకు సుమారు 60 అడుగుల ఎత్తుతో నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని, ఈ నిర్మాణం పూర్తయితే భవిష్యత్తులో వరదల నుంచి నగరానికి మెరుగైన రక్షణ లభిస్తుందని వివరించారు. అయినప్పటికీ, చెక్‌డ్యామ్ కారణంగానే వరదలు వస్తున్నాయంటూ తప్పుడు ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ ప్రభుత్వం దానిని కూల్చివేసిందని విమర్శించారు. ప్రజలకు మేలు చేసే చెక్‌డ్యామ్‌ను తొలగించడం ద్వారా నగరంపై నీటి కొరతను కాంగ్రెస్ ప్రభుత్వమే ఆహ్వానించిందని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో సుమారు రూ.90 కోట్లతో ఐదు చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టి భూగర్భ జలాలను పెంపొందించే దిశగా చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు.గతంలో ప్రకాశ్‌నగర్ చెక్‌డ్యామ్ నిర్మాణానికి ముందు సంబంధిత అధికారులు, ఇరిగేషన్ శాఖ ఇంజినీర్లు సమగ్ర సర్వే నిర్వహించి, సాంకేతిక నివేదికలు (డీపీఆర్‌లు) సిద్ధం చేశారని ఆ నివేది కల ఆధారంగానే గత ప్రభుత్వం చెక్‌డ్యామ్ నిర్మించిందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అదే అధికార యంత్రాంగంతో విరుద్ధమైన నివేదికలు తయారు చేయించి కూల్చివేతకు మార్గం సుగమం చేసిందని ఆరోపించారు. సుమారు 200 మీటర్ల పొడవు, 3 మీటర్ల ఎత్తుతో నిర్మించిన ఈ చెక్‌డ్యామ్‌ను 2023 వరదలను సాకుగా చూపుతూ ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు ప్రజలకు వెల్లడించకుండా హడా వుడిగా కూల్చివేసిందని విమర్శించారు.ప్రజలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తులను సంరక్షించి మరింత బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రజోపయోగ నిర్మాణాలను ధ్వంసం చేయడానికే పరిమితమైందన్నారు. కొత్త అభివృద్ధి పనులు చేప ట్టలేక, గత ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను కూల్చివేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనగా మారిందని విమర్శించారు.ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో భవిష్యత్తులో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి నిల్వలను పెంచడం, చెరువులు, వాగులు, చెక్‌డ్యామ్‌లను సంరక్షించడం, భూగర్భ జలాలను పరిరక్షించడం వంటి ముందస్తు చర్యలు తీసుకోవ డంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. దీని కారణంగా రానున్న రోజుల్లో ఖమ్మం నగరం తీవ్ర తాగునీటి సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు ధోరణిని విడనాడి ఖమ్మం నగర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర తాగునీటి కార్యాచరణ ప్రణా ళికను ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే మున్నేరు వాగులో నీటి నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించే చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు గుండాల కృష్ణ, బచ్చు విజయ్ కుమార్, పగడాల నాగరాజు, బత్తుల మురళిప్రసాద్, ఖమర్, పాలడుగు పాపారావు, మాటేటి నాగేశ్వరరావు, తోట రామారావు, తాజుద్దీన్, మెంతుల శ్రీశైలం, ఎర్రా అప్పారావు, మాటేటి కిరణ్, కొప్పెర నర్సింహా రావు, ముక్కాల రాజేశ్, రఘు, రవి, తదితరులు పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి వేడుకల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

- **బోనకల్ షిరిడీ సాయిబాబా ఆలయంలో మాజీ జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజు ప్రత్యేక దర్శనం**





**బోనకల్, జూలై 29, నేటి శుభోదయ :** గురు పౌర్ణమి పవిత్ర పర్వదినాన్ని పుర స్కరించుకుని బోనకల్ గ్రామంలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్ర ద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజు ఆలయాన్ని సందర్శించి షిరిడీ సాయిబాబా వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు.ఈ కార్యక్రమంలో బోనకల్ గ్రామ సర్పంచ్ బానోత్ జ్యోతి, ఉపస ర్పంచ్ బానోత్ కొండాతో కలిసి ఆలయంలో నిర్వహించిన గురు పౌర్ణమి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం సాయిబాబా వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యా లతో ఉండాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా మాజీ జెడ్పీ చైర్మన్ లింగాల కమల రాజు మాట్లాడుతూ, "గురు పౌర్ణమి భారతీయ సంస్కృతిలో అత్యంత విశిష్టమైన ఆధ్యాత్మిక పర్వదినం. గురువును దైవస్వరూపంగా భావించి ఆరాధించే ఈ రోజు ప్రతి ఒక్కరి జీవితానికి స్ఫూర్తినిచ్చేదిగా నిలుస్తుంది. షిరిడీ సాయిబాబా బోధించిన ప్రేమ, సేవ, మానవత్వం, సర్వమత సమానత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలి. సాయిబాబా వారి కృపతో రాష్ట్ర ప్రజలందరికీ సుఖశాంతులు, ఐశ్వర్యం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని అన్నారు.ఆలయ ప్రాంగణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయిబాబా దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురు పౌర్ణమి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేయగా, భక్తులు భక్తిశ్రద్ధలతో కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బోనకల్ సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుండపనేనీ సుధాకర్ రావు, పార ప్రసాద్ , తాళ్లూరు జ్యోతి, రంగా అనురాధ.. తదితరులు పాల్గొన్నారు..

## మాలతికి వంశీ మహానంది అవార్డ్-2026

- **12 గంటల్లో 123 యుగళ గీతాలు**
- **డైమండ్ వరల్డ్ రికార్డ్ లో నమోదు**




**ఖమ్మం, జులై 29, నేటి శుభోదయ :** గానంతో ఐదు అంతర్జాతీయ రికార్డులు,ఒక జాతీయ అవార్డ్ గ్రహీత,గోల్డెన్ స్టార్ వరల్డ్ రికార్డ్స్ ఫోరం తెలంగాణ రాష్ట్ర ముఖ్య సమన్వయకర్త ఖమ్మం నగరానికి చెందిన గాయని వంజా మాలతి నాయుడు ప్రతిష్టాత్మక "వంశీ మహానంది గ్లోబల్ మ్యూజిక్ అవార్డ్–2026" అందుకున్నారు.అదేవిధంగా డైమండ్ వరల్డ్ రికార్డ్ లో నమోదయ్యారు.మంగళవారం హైదరాబాద్ లోని సీటీ కల్చరల్ స్టూడియో లో గాన గంధర్వ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దీర్ఘ గానలహరి కార్యక్రమం జరిగింది. ఇందులో 12 గంటలపాటు 123 సినీ యుగళ గీతాలను సీనియర్ గాయకుడు,గానరత్న పద్ద వెంకట్ తో కలిసి మాలతి ఆలపించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా పాల్గొన్న తెలంగాణ శాసనసభ తొలి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ గాయకులిరువురూ అద్భుతంగా పాటలను వినిపించి తన్మయం చెందేలా చేశారని,ప్రస్తుత సమాజంలో నెలకొన్న వైషమ్యాలు,మానసిక ఒత్తిళ్లకు విరుగుడు కలిగించేది సంగీతమని పేర్కొన్నారు. కళాబ్రహ్మ,శిరోమణి డా.వంశీ రామరాజు ప్రసంగిస్తూ 55 ఏళ్లుగా వంశీ అవార్డులు ఎంతోమంది సినీ నటులు,గాయకులతోపాటు స్టేజి షోలపై ఉత్తమ ప్రదర్శన చేసిన వారికి అందించడం జరుగుతోందని వివరించారు.వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఇండియా చీఫ్ కో–ఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్ సమన్వయకర్తగా వ్యవహరించారు.అనంతరం మధుసూదనాచారి,వంశీ రామరాజు,బింగి నరేందర్ గౌడ్ చేతుల మీదుగా మాలతి వంశీ మహానంది గ్లోబల్ మ్యూజిక్ అవార్డ్–2026 తో పాటు డైమండ్ వరల్డ్ రికార్డ్ లో నమోదైన ధృవీకరణ పత్రాన్ని అందుకున్నారు. సీనియర్ ఈవెంట్ ఆర్గనైజర్ సయ్యద్ బాజీ నిర్వహణ,పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఖమ్మానికి చెందిన కళా సంస్థలు,కళాకారులు ఆమెను అభినందిం చారు.

## గురువుల ఆశీస్సులతోనే జీవితానికి వెలుగు..

## సేవా మార్గమే నిజమైన గురుదక్షిణ

- **మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి**



**షాద్‌నగర్, జూలై 29, నేటి శుభోదయ :** గురు పౌర్ణమి సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదవ్యాస మహర్షి, గురు పరంపరను స్మరించుకుంటూ గురువులకు భక్తిశ్రద్ధలతో నివాళులు అర్పించారు.ఆమె మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో గురు పౌర్ణమికి ఎంతో విశిష్టమైన స్థానం ఉందని, జ్ఞానాన్ని అందించి జీవితా నికి సరైన దిశను చూపించే గురువుల సేవలు ఎప్పటికీ మరువ లేనివని అన్నారు. గురువు చూపిన మార్గంలో నడవడం, సమాజానికి సేవ చేయడమే నిజమైన గురుదక్షిణ అని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ తమ గురువులను గౌరవిస్తూ, వారు బోధించిన విలువ లను జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. సద్గురు సాయిబాబా బోధించిన 'శ్రద్ధా – సబూరి' సూత్రాలు ప్రతి ఒక్కరి జీవితానికి మార్గదర్శకాలని తెలిపారు. ప్రేమ, సేవ, సహనం, త్యాగం, మానవత్వం వంటి విలువలను అలవర్చుకుంటే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.గురు పౌర్ణమి సందర్భంగా అందరూ గురువుల ఆశీస్సులు పొందుతూ సన్మార్గంలో ముందుకు సాగాలని తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి ఆకాంక్షించారు.

## ట్రాన్స్‌ఫార్మర్ తాకి ఆవు మృతి



**కేశంపేట, జులై 29, నేటి శుభోదయ :**
కేశంపేట మండల పరిధి లోని తొమ్మిది రేకుల గ్రామం బాల్యతాండకు చెందిన ఉడిత్యవత్ శివకు చెందిన ఆవు విషాదకరంగా మృతి చెందింది. నీరు తాగేందుకు వెళ్లిన ఆవు అక్కడే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో కరెంట్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయింది. సుమారు రూ.50 వేల విలువైన ఆవును కోల్పోవడంతో రైతు శివ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. జీవనాధారమైన పశువును కోల్పోయిన తనను ప్రభుత్వం ఆదుకుని తగిన ఆర్థిక సహాయం అందించాలని బాధిత రైతు కోరుతున్నారు.

## శ్రీ సరస్వతీ శిశు మందిర్ సదాశివపేట
### - గురు పౌర్ణమి కార్యక్రమము



**సంగారెడ్డి, జూలై 29, నేటి శుభోదయ :**
శ్రీ సరస్వతీ శిశు మందిర్ సదాశివపేట పాఠశాలలో గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమాన్ని ముందుగా శ్రీ ప్రవీణ్ గారు(ఉపాధ్యాయులు), శ్రీ అశోక్ గుప్త (రోటరీ క్లబ్ సెక్రటరీ) గారి చేతులమీదుగా దీప ప్రజ్వలన చేయించడం జరిగింది. శ్రీ ప్రవీణ్ గారు గురు పౌర్ణమిని వ్యాస పౌర్ణమి అంటారని వేద వ్యాసుని పుట్టినరోజు ప్రతి సంవత్సరము మనము గురు పౌర్ణమి కార్యక్రమం జరుపుకుంటామని. వేద వ్యాస మహర్షి ఋషులలోనే ఈయన గొప్ప రుషి అని గురువులు అందరిలో మొట్టమొదటి గురువు వేద వ్యాస మహర్షి అని తెలిపారు.మహాభారతాన్ని ,బ్రహ్మ సూత్రాలను వేద వ్యాసమహర్షి రచించారని , అన్నము తిన్న తర్వాత ఒక గంట రెండు గంటలకే అరిగిపోతుంది. వస్త్రము సంవత్సరానికి చినుగుతుంది భూమిని, ఆస్తిని దొంగలు దొంగలిస్తారు కానీ విద్యను ఎవరు దొంగలించలేరని అటువంటి విద్యను నేర్పిన గురువులని మనము గౌరవించాలని తెలిపారు. వేద వ్యాస మహర్షి మహాభారతాన్ని రచించారు. ఈయన వేదాలను నాలుగు భాగాలుగా విభజించారు ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం ,అధర్మన వేదం. ఈ వేదాలు ప్రజలందరికీ ఎన్నో విధాలుగా సహాయ పడ్డాయి వీటిలో ఉన్నటువంటి మంచి చెడు విషయాలను వేదవ్యాస మహర్షి ప్రజలందరికీ తెలియజేసేలా చేశారని విద్యార్థులకు తెలియజేశారు. గురు పౌర్ణమి సందర్భంగా పాఠశాల బృందం శ్రీ ప్రవీణ్ గారికి ,శ్రీ అశోక్ గుప్తా గారికి శాలువతో సన్మానం చేశారు. శ్రీ లక్ష్మణ్ గారు (పాఠశాల కార్యదర్శి), శ్రీ తమ్మలి సంగమేశ్వర్ గారు (పాఠశాల ప్రధానాచార్యులు), మాతాజీలు, విద్యార్థులు పాల్గొన్నారు

## గురువుల మార్గదర్శకత్వమే విద్యార్థుల భవిష్యత్తుకు బాట -ప్రధానోపాధ్యాయులు రమేష్



**కేశంపేట, జూలై 29, నేటి శుభోదయ :**
కేశంపేట మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామంలోని వీఐపీ పబ్లిక్ పాఠశాలలో గురు పూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలలో వేద మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ,, వేదాలను ప్రపంచానికి అందించిన మహర్షి వేదవ్యాసుడి జన్మదినాన్ని పురస్కరించుకొని గురు పూర్ణిమను జరుపుకుంటారని తెలిపారు.గురువులు విద్యార్థులకు కేవలం విద్యను మాత్రమే కాకుండా మంచి నడవడి, క్రమశిక్షణ, నైతిక విలువలను నేర్పించి వారి భవిష్యత్తుకు సరైన మార్గనిర్దేశం చేస్తారని అన్నారు. సమాజంలో గురువులకు ఎంతో ఉన్నతమైన స్థానం ఉందని పేర్కొన్నారు.విద్యార్థులు తమ గురువులను గౌరవించి, వారు చూపించే మార్గంలో నడవాలని సూచించారు. గురువుల ఆశీస్సులతోనే విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వెంకటకృష్ణ, కరస్పాండెంట్ నరేష్, వైస్ ప్రిన్సిపాల్ ఎండీ వాజీద్, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## బోనకల్‌లో సోలార్ విద్యుత్‌కు మార్గం సుగమం
### - హైట్ విద్యుత్ స్తంభాల పనులకు శ్రీకారం

- చిన్న విద్యుత్ స్తంభాల స్థానంలో హైట్ పోల్స్ ఏర్పాటు పనులను ప్రారంభించిన ఉప సర్పంచ్ బానోతు కొండ
- గ్రామంలో ఆధునిక విద్యుత్ సౌకర్యాల దిశగా మరో అడుగు
- సోలార్ కోసం హైట్ పోల్స్ ఏర్పాటు ప్రారంభం



**బోనకల్, జూలై 29, నేటి శుభోదయ :**
బోనకల్ గ్రామపంచాయతీ పరిధిలో సోలార్ విద్యుత్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి చిన్న విద్యుత్ స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో హైట్ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసే పనులను గ్రామ ఉప సర్పంచ్ బానోతు కొండ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ మౌలిక సదుపాయాలను ఆధునికీకరించేందుకు గ్రామపంచాయతీ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. హైట్ విద్యుత్ స్తంభాల ఏర్పాటు ద్వారా సోలార్ విద్యుత్ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయడంతో పాటు, విద్యుత్ సరఫరా నాణ్యత మెరుగుపడుతుందని అన్నారు. గ్రామాభివృద్ధి, ప్రజల సౌకర్యాలే లక్ష్యంగా దశలవారీగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.పనులను పరిశీలించిన ఉప సర్పంచ్ బానోతు కొండ సంబంధిత అధికారులకు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. స్థానిక ప్రజలు ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ గ్రామంలో మెరుగైన విద్యుత్ సదుపాయాలు అందుబాటులోకి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో. 11 వార్డ్ నెంబర్ ఉప్పర్ శీను, విద్యుత్ శాఖ అధికారులు. సబ్ ఇంజనీర్ హరి ప్రవీణ్ , లైన్ ఇన్స్పెక్టర్ జమీర్ , బోనకల్ లైన్ ఇన్స్పెక్టర్ ఐ సీతయ్య, అసిస్టెంట్ లైన్మెన్ బానోతు రాజేష్ , దస్తగిరి, గ్రామస్తులు తేలూరి రమేష్, వెన్నపోయిన వెంకటేశ్వరరావు, జై రాజు, శ్రీను గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## "ప్రకృతి మానవాళికి వరం "
### - ప్రకృతి ఉంటేనే ఆరోగ్యం, ఆరోగ్యం ఉంటేనే ఆర్థిక వ్యవస్థ ప్రగతి





**ఖమ్మం, జూలై 29, నేటి శుభోదయ :**
ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా. అభివృద్ధి పేరుతో, అవకాశాల పేరుతో, అవసరాల పేరుతో ఇలా అమూల్యమైన సహజ వనరులను దుర్వినియోగం చేస్తే మూల్యం చెల్లించక తప్పదని అనేక సందర్భాల్లో ప్రకృతి వైపరీత్యాలతో మనకు రుజువైంది . నూతన ఆవిష్కరణలు, ప్రగతి మాట ఎలా ఉన్నా, ప్రకృతి మనకు ఉచితంగా అందిస్తున్న సహజ వనరులు గాలి, నీరు, భూమి,అడవులు, ఖనిజలు, వన్య ప్రాణులు ఇలా అనేక సహజసిద్ధ వనరులను మనం దుర్వినియోగం చేస్తే భావితరాలకు తీవ్ర అన్యాయం చేసినట్లు అవుతుంది. పర్యావరణ పర్యవేక్షణ, ప్రకృతి పరిరక్షణ తో సమతూల్యత పాటించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు 2026 సంవత్సరాన్ని ప్రకృతి పునర్ధరణ, సహజ వనరులను సుస్థిరం చేయడం సమిష్టి బాధ్యతగా లక్ష్యాన్ని నిర్ణయించుకున్నాయి. దెబ్బతిన్న ఆడవులను పరిరక్షించడం, నీటి వనరులు కాపాడుకోవడం, విస్తృతంగా చెట్లు పెంపకం ద్వారా పునరావాస కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో విస్తృతపరచడం జరగాలి. మానవ జీవన వైవిధ్యంలో వస్తున్న మార్పులు, ముఖ్యంగా వాతావరణంలో వస్తున్న ఊహించని మార్పులను తట్టుకునేలా నగరీ కరణ ప్రాంతాల్లో మరింత పచ్చదనాన్ని అభివృద్ధి చేయాలి. రైతులు వాతావరణ ప్రతికూల పరిస్థితుల్లో సైతం వ్యవసాయం కొనసాగించి రైతుకు నష్టం రాకుండా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి. మానవ సమాజ పరిణామ క్రమానికి మూలాలైన అడవులను, వాటికి రక్షణ కవచంగా ఉంటున్న ఆదివాసులను కాపాడుకోవడం ప్రధాన లక్ష్యం కావాలి. అంతరించిపోతున్న ఔషధ మొక్కలను కాపాడుకుంటూ వాటి విస్తరణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. ముఖ్యంగా వర్షపు నీటి చుక్కను వృధా కాకుండా భూమిలోకి ఇంకిపోయేలా ఒడిసిపట్టే కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో విస్తృతపరచాలి. మానవ జీవన శైలిలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించలా చర్యలు ఉండాలి. ప్లాస్టిక్ వాడకం, అమ్మకాల కంటే ఉత్పత్తి చేసే ప్లాస్టిక్ పరిశ్రమల మీద కఠిన చర్యలు ఉండాలి. ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, కార్పొరేట్ సంస్థలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి జావబుదారితనం ఉండేలా పారదర్శకతతో నిర్ణీత కాలంలో అంచలవారీగా నిధులు, విధులు సమిష్టి నిర్ణయం వ్యక్తిగత వ్యక్తిగత బాధ్యత ఖరారు చేయాలి. ప్రకృతి మనకు అందిస్తున్న అమూల్యమైన సహజ వనరులు మానవాళికి వరం లాంటివి. ప్రకృతి ఉంటేనే ఆరోగ్యం ఉంటుంది..ఆరోగ్యం ఉంటేనే ఆర్థిక వ్యవస్థ ప్రగతి సాధిస్తుందన్నది నగ్నసత్యం. సమన్వయంతో సంయుక్త వ్యూహం అవసరం గిరిజన ప్రాంతంలో పనిచేసేటువంటి సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ, సముద్ర తీర ప్రాంతంలో పనిచేస్తున్నటువంటి మత్స్యకార సంస్థ, కాలుష్య నియంత్రణ మండలి, అటవీ శాఖ, విశ్వవిద్యాలయంలో ఉన్నటువంటి వృక్ష మరియు జంతు శాస్త్రాల విభాగం, పరిశ్రమల శాఖ, కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి సంయుక్తంగా ప్రకృతిని కాపాడుకుంటూ సమతుల్యత పాటించడానికి చిత్తశుద్ధి అవసరం.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు - మంత్రి పొంగులేటి

- దశలవారీగా ప్రతీ కుటుంబానికి మంజూరు
- రూ.21వేల కోట్లతో రైతన్నపై రుణభారం తగ్గించాం
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం
- ఖమ్మం రూరల్ మండలంలో రూ.7.21 కోట్ల రోడ్డు పనులకు శంకుస్థాపన





**ఖమ్మం, జూలై 29, నేటి శుభోదయ :**
ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటనూ తూచా తప్పకుండా అమలు చేస్తుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ప్రజల ఆశీస్సులతో ఏర్పడిన తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తూ ముందుకు సాగుతోందన్నారు.బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ఖమ్మం రూరల్ మండల పరిధిలో రూ.7.21 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. డాక్యా తండాలో రూ.1.41 కోట్లతో మంగళగూడెం–డాక్యా తండా రోడ్డు, పల్లెగూడెంలో రూ.5.80 కోట్లతో గొల్లగూడెం నుంచి ఎన్.ఎస్.పీ. మీదుగా పల్లెగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి అన్నారు. రైతు భరోసా ద్వారా ప్రతి ఎకరానికి రూ.6 వేల చొప్పున కేవలం 9 రోజుల్లోనే రూ.9,200 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. రూ.2 లక్షల వరకు ఉన్న రుణమాఫీ ద్వారా 25 లక్షల మంది రైతులకు రూ.21,000 కోట్ల మేర ఆర్థిక భారం తగ్గించామని వివరించారు. సన్న వరిధాన్యానికి మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు.నాలుగు విడతల్లో నిరుపేదల సొంతింటి కలను నిజం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. తొలి విడతలో 4.50 లక్షలు, రెండో విడతలో 2.50 లక్షలతో కలిపి ఇప్పటివరకు మొత్తం 7 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. రెండో విడతలో మిగిలిన గ్రామాలకు త్వరలోనే ఇళ్లు మంజూరు చేస్తామని, రాబోయే మూడో, నాలుగో విడతల్లో అర్హులైన ప్రతీ కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు.--- మహిళా సాధికారతే ధ్యేయం రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టామని అన్నారు. గ్రామీణ రహదారులు, విద్యాసంస్థలు, తాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి ఆగిపోకుండా ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, ఖమ్మం ఆర్‌డీవో ఎన్.శ్రీనివాస్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, పీఆర్ ఈఈ మహేష్‌బాబు, పలువురు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీపై పొంగులేటి సుధాకర్ రెడ్డి వ్యాఖ్యలు

- బీ జె పి దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనం
- ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే బురదజల్లే ప్రయత్నం
- డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



**ఖమ్మం, జూలై 29, నేటి శుభోదయ :** జంతర్ మంతర్ వేదికగా ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై బీజేపీ నేతలు చేసిన విమర్శలు వారి రాజకీయ దివాళాకోరుతనానికి, ప్రజా సమస్యలపై సమాధానం చెప్పలేని అసమర్థతకు నిదర్శనమని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భావి భారత పౌరులైన విద్యార్థుల భవిష్యత్ తో చెలగాటమాడుతూ,ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడే ధైర్యం లేక వ్యక్తిగత విమర్శలతో కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు.దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల ఆత్మహత్యలు, ఆర్థిక అసమానతలు, మహిళల భద్రత వంటి కీలక అంశాలపై ప్రజలు సమాధానం కోరుతుంటే, వాటిని పక్కనబెట్టి రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని చౌకబారు రాజకీయాలు చేయడం బీజేపీ వైఫల్యాన్ని బయటపెడుతోందన్నారు. అబద్ధాలను పదేపదే ప్రచారం చేస్తే అవే నిజాలవుతాయని బీజేపీ భ్రమపడుతోందని విమర్శించారు.రాహుల్ గాంధీ దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం నిరంతరం గొంతెత్తుతున్న నాయకుడని, ఆయన లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వ్యక్తిగత దాడులకు దిగడం అధికార పార్టీ బలహీనతకు నిదర్శనమన్నారు. విమర్శలకు బదులు వాస్తవాలతో సమాధానం చెప్పే సంస్కృతి బీజేపీకి లేదని ఎద్దేవా చేశారు. జంతర్ మంతర్‌లో జరిగిన కార్యక్రమాన్ని వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఎంత చేసినా సత్యాన్ని దాచలేరన్నారు. ప్రజల అసలు సమస్యలపై చర్చించకుండా ప్రతిపక్షంపై బురదజల్లడం ద్వారా తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.ప్రజల తీర్పు అన్నింటికంటే గొప్పదని, అహంకారం, అసత్య ప్రచారం, వ్యక్తిగత దూషణలతో రాజకీయాలు చేసే వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని నూతి సత్యనారాయణ గౌడ్ హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి రాజ్యాంగ పరిరక్షణ, ప్రజా సంక్షేమం కోసం తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు.

## మానవసేవయే మాధవసేవ - నిస్వార్థ సేవలందిస్తున్న లయన్స్ క్లబ్బులు





**వైరా, జూలై 29, నేటి శుభోదయ :** వైరాలోని ఎన్వీఎస్ గార్డెన్ లో మంగళవారం రాత్రి వైరా లయన్స్ క్లబ్ గ్రేట్ విజన్ క్లబ్ మరియు నూతన మహిళా క్లబ్ అవని నూతన ప్రమాణ స్వీకార మహోత్సవంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ కాపా చంద్రకళ పాల్గొన్నారు వై బుచ్చి రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ మానవసేవయే మాధవ సేవని మార్గంలో నిస్వార్థతో నిబద్ధతతో ఒక ప్రణాళిక బద్ధంగా 21 సంవత్సరాలుగా వైరా లయన్స్ క్లబ్ సేవలందిస్తోందని ఆమె తెలిపారు. నూతన క్లబ్బుల ప్రమాణస్వీకారాన్ని నూతన సభ్యులను ఫాస్ట్ గవర్నర్ జిల్లా గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ వి డి జి వన్ సతీష్ కుమార్ కోడె సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు పిఎస్టిలుగా కొల్లా రాంబాబు గద్దె నీరజ ఉయ్యూరి రామకృష్ణ కార్యవర్గం బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ప్రమాణ స్వీకారం చేయించారు వారు మాట్లాడుతూ సమాజంలో క్లబ్బుల సేవలను విస్తరించాలని దానికనుగుణంగా నూతన కార్యవర్గం సమిష్టి కృషితో ముందుకు వెళ్లాలని వారు సూచించారు ఈ కార్యక్రమంలో పి డి జి లు మోత్కూరి మురళీధర్ రావు యానాల మోహన్ రెడ్డి అమృతవల్లి కోటేశ్వరరావు రీజన్ చైర్మన్ నూకల శ్రీనివాసరావు జోన్ చైర్మన్ తోటకూర శ్రీకాంత్ క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ పెనుగొండ ఉపేందర్ రావ్ ఎల్సిఐఎఫ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్ రావు జిఈటి కోఆర్డినేటర్ ఉంద్రు శ్యాంబాబు ప్రోగ్రాం చైర్ పర్సన్ నూకల ప్రసాద్ రావు కోచైర్ పర్సన్ ఉంద్రు వరలక్ష్మి వర్తక సంఘం అధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు జిల్లా నాయకులు మందడపు ప్రభాకర్ రెడ్డి మూడు క్లబ్బుల సెక్రటరీ కోశాధికారులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## రేవంత్ పాలనలో వానాకాలంలోనూ విద్యుత్ సమస్యలు

### : మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



**వికారాబాద్, జూలై 29, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా బంట్వారం మండలంలోని రొంపల్లి, మంగ్రాస్‌పల్లి గ్రామాల్లో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత బలోపేతంతో పాటు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.సమావేశంలో మాట్లాడిన ఆయన, కేసీఆర్ హయాంలో అమలైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ, ఆ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ప్రస్తుతం ఆశించిన స్థాయిలో కొనసాగడం లేదని విమర్శించారు. కేసీఆర్ పాలనలో ఎండాకాలంలో కూడా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేదని, ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వ హయాంలో వానాకాలంలో సైతం విద్యుత్ అంతరాయాలు ఎదురవుతున్నాయని ఆరోపించారు.మిషన్ భగీరథ వంటి కీలక పథకాల అమలులో కూడా నిర్లక్ష్యం కనిపిస్తోందని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలే ప్రధాన బలమని, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## 7న హైదరాబాద్ లో పెన్షనర్ల మహాధర్నా

- ఎస్జీపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య
- డిఎస్ నకారా కు ఘన నివాళులు
- రెండు వేల కోట్లు ఎక్కడ?




**ఖమ్మం, జూలై 29, నేటి శుభోదయ :** సమస్యల సుడిగుండంలో విలవిల లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ హైదరాబాద్ లో పెన్షనర్ల మహాధర్నా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్జిపిఏటి)జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య తెలిపారు.బుధవారం పెన్షనర్ల పితామహుడు డి. ఎస్ నకారా వర్ధంతి సభకు అధ్యక్షత వహించిన పరిశ పుల్లయ్య మాట్లాడుతూ మూడేళ్లు గడిచినా, పి ఆర్ సి జాడ తెలవటంలేదని,ఆరువిడతల డిఏ బకాయిలు పెట్టారని, హెల్త్ కార్డులు, స్కీమ్ గురించి పెద్ద పెద్ద ప్రకటనలు వచ్చాయని కాని ఆచరణలో ఏమీ లేదని, పెన్షనర్ల కోసం ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు, ప్రత్యేకోపాధ్యాయుల సర్వీసుకు నోషనల్ ఇంక్రిమెంట్లు, 2024 మార్చి తర్వాత ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల బకాయిల చెల్లింపు తదితర సమస్యలతో పెన్షనర్లు మానసిక వేదనకు గురి అవుతున్నారని చెప్పారు.డిఎస్ నకారా వర్ధంతి సందర్భంగా ఖమ్మం జిల్లా నుండి పెన్షనర్లు ఉద్యమ సమరశంఖం పూరిస్తున్నామని, పెన్షనర్ల సమస్యలు సత్వరం పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య డిమాండ్ చేసారు.మే నెల పెన్షన్లు / వేతనాల నుండి హెల్త్ స్కీమ్ ప్రీమియం మినహాయిస్తున్న ప్రభుత్వం, రెండునెలలు గడిచినా కార్డులు ఇవ్వక, వైద్యం అందక స్కీమ్ పరిస్థితి అగమ్యగోచరంగా ఉండి పెన్షనర్లు తల్లడిల్లుతున్నారని పరిశ పుల్లయ్య తెలిపారు.ముందుగా పెన్షనర్ల పితామహుడు డి ఎస్ నకారా వర్ధంతి సందర్భముగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పెన్షనర్ల డిమాండ్ పోస్టర్లను రాష్ట్ర కార్యదర్శి వి మేరి ఏసుపాదం, జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్ ఆవిష్కరించారు.కార్యక్రమంలో జిల్లా శాఖ సంయుక్త అధ్యక్షులు కనపర్తి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పెదమళ్ళ సత్యనారాయణ, కొలికొండ శరత్ బాబు, ఊడుగు వెంకటేశ్వర్లు, జల్లా వెంకటేశ్వర్లు, మహిళా కార్యదర్శులు బోజెడ్ల కృష్ణకుమారి, తాడి అంజలి, సీనియర్ పెన్షనర్లు చీదిరాల వెంకటేశ్వర్లు, రాయల వెంకటేశ్వర్లు,ఎస్కే అబ్దుల్ షరీఫ్,కార్యదర్శులు బెల్లం రాధాకృష్ణ మూర్తి, గండ్లూరి కృష్ణారావు,పివిఆర్కేవి ప్రసాదరావు,కంచుమర్తి పుల్లయ్య, యండిహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## గురు పూర్ణిమ సందర్భంగా పుణ్యక్షేత్రాల దర్శనం

### - స్వామీజీలకు ఘన సన్మానం



**సంగారెడ్డి , జూలై 29, నేటి శుభోదయ :** గురు పూర్ణిమ సందర్భంగా సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం గౌరవ సలహాదారులు శ్రీ అనిమిశెట్టి జయప్రకాశ్ గారి పలువురు సభ్యులు కర్ణాటకలోని గనగాపూర్ శ్రీ గురు దత్తాత్రేయ స్వామి ఆలయాన్ని దర్శించారు. అనంతరం బర్దిపూర్‌లోని దత్తగిరి ఆశ్రమం,గురు పూర్ణిమ సందర్భంగా శాలువాలు, పుష్పమాలలతో ఘనంగా సన్మానించి వారి ఆశీర్వాదాలు పొందారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధ్యక్షులు శ్రీ బుగ్గనగారి మల్లికార్జున్ గారు, కంది మాజీ సర్పంచ్ శ్రీ బుగ్గనగారి వీరేశం గారు, శ్రీ ఎ. గోపాల్ గారు, శ్రీ సునీల్ కుమార్ (అపెక్స్) గారు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "గురు పూర్ణిమ పర్వదినం సందర్భంగా ప్రతి ఇంట ఆనందం వెల్లివిరియాలని, ప్రతి రైతు కుటుంబం సుభిక్షంగా ఉండాలని శ్రీ గురు దత్తాత్రేయ స్వామిని ప్రార్థించాము" అని తెలిపారు.

## నల్లమోతు నరసింహారావు మృతికి సిపిఐ నివాళులు



**కొణి జర్ల, జూలై 29, నేటి శుభోదయ :** కొణిజర్ల మండలం రామనవసయ్య నగర్ సిపిఐ నాయకులు నల్లమోతు నరసరావు అనారోగ్యంతో మృతి చెందడంతో మరణ వార్త తెలిసిన వెంటనే బుధవారం సిపిఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, సిపిఐ జిల్లా నాయకులు స్వర్ణ రమేష్, నల్లమోతు నరసింహారావు దేహాని సందర్శించి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దొండపాటి రమేష్ మాట్లాడుతూ పేద ప్రజల పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి నిరంతరం కొనసాగించే నరసింహారావు మరణం తీరనిలోటని వారు పేర్కొన్నారు. వీరితో పాటు సిపిఐ నాయకులు ఆంగోవత్ మంగీలాల్, గోగ్గులోతు శ్రీనివాస్, శోభన్, ముత్తయ్య, సక్రు, లక్య తదితరులు పాల్గొని నరసరావుకు నివాళులర్పించారు.

## రేషన్ డీలర్ల సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఘన శ్రీకారం



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 29, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్ర ఆథరైజ్డ్ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్ బాబు, రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు ఊకె శేఖర్ భద్రాచలం మండలంలో ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఊకె శేఖర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి ప్రతి రేషన్ డీలర్‌ను సంఘంలో సభ్యుడిగా చేర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. రేషన్ డీలర్ల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సంఘం మరింత బలోపేతం కావాలంటే ప్రతి డీలర్ సభ్యత్వం తీసుకుని సంఘానికి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.సభ్యత్వ నమోదు కార్యక్రమానికి రేషన్ డీలర్ల నుంచి విశేష స్పందన లభించిందని, జిల్లా, డివిజన్, మండల స్థాయి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు భూక్యా సందీప్, భూక్యా లక్ష్మణ్, జీ. రమేష్, ఎస్. రాంబాబు, వి. వీరయ్య, భూక్యా సాయి కౌశిక్, కె. రమాదేవి, పి. సరోజిని తదితరులు పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమంలో పాల్గొన్న జోగుపర్తి ప్రభాకర్ రావు



**ఖమ్మం, జూలై 29, నేటి శుభోదయ :**
ఖమ్మంజిల్లా అభివృద్ధి ప్రదాత పూజ్యులు పెద్దలు మాజీ మంత్రివర్యులు పువ్వాడ అజయ్ కుమార్ ఆదేశానుసారం ఖమ్మం నగరంలో గల నాలుగోవ డివిజన్ 63 బూతులో( సర్ ) కార్యక్రమంలో భాగంగా నాలుగవ డివిజన్ బి ఆర్ ఎస్ మాజీ అధ్యక్షులు జోగుపర్తి ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది . బుధవారం జరిగిన కార్యక్రమంలో బిఎల్ఓ లు సుదర్శన్ రావు సమక్షంలో బిఆర్ఎస్ నాయకులు కంచర్ల దయాకర్, డివిజన్ మాజీ ప్రధాన కార్యదర్శి షేక్ వలి, పాల్గొన్నారు. ఓటరు రిజిస్ట్రేషన్ చేసిన వారి పేర్లు(1) ఆదూరి సింధూకిరణ్ (2) ఆరెపల్లి సావిత్రి (3) మల్లయ్య ఆరెపల్లి (4) వెంకట గణేష్ వీరి ఓటును ఆన్లైన్ చేసి రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది.

## నామ తల్లిదండ్రుల స్మృతి వనాన్ని సందర్శించిన లెఫ్టినెంట్ గవర్నర్



**ఖమ్మం, జూలై 29, నేటి శుభోదయ :**
జమ్మూ అండ్ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బుధవారం ఖమ్మం పర్యటనలో భాగంగా రూరల్ మండలం గొల్లగూడెం గ్రామంలో ఉన్న నామ ముత్తయ్య–వరమ్మ స్మృతివనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తల్లిదండ్రులు నామ ముత్తయ్య, వరమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీని సందర్శించి, నామ ముత్తయ్య–వరమ్మ జీవిత విశేషాలు, సమాజానికి అందించిన సేవల గురించి ఆసక్తిగా తెలుసుకున్నారు. అక్కడ ప్రదర్శించిన అరుదైన చిత్రాలను పరిశీలించారు. ఆ గ్యాలరీ ఫోటోల విశేషాలను నామ సోదరుడు సీతయ్య వివరించారు. స్మృతివనంలో ఏర్పాటు చేసిన మొక్కలను, పరిసరాలను పరిశీలించి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. అనంతరం అక్కడ నుంచి హైదరాబాద్ పయనమయ్యారు.

## ప్రతి ఒక్కరూ నీటి వనరులను సంరక్షించుకోవాలి

### - ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి



**కేశంపేట, జూలై 29, నేటి శుభోదయ :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమంలో భాగంగా బుధవారం కేశంపేట మండలంలోని నిర్దవెల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,,,భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ నీటి వనరుల సంరక్షణకు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించడం ద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకించవచ్చని, రైతులు తమ వ్యవసాయ పొలాల వద్ద నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవడం వల్ల భూగర్భ జలాల మట్టం పెరిగి సాగునీటి సమస్యలు తగ్గే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న జలసిరి కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సఫూర అమేర్, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, జీపీఓ వెంకటయ్య, ఐకేపీ సీసీ పరంధాములు, వార్డు సభ్యులు లక్ష్మణ్ బాబు, నాగరాజు, చంద్రయ్య, చెన్నయ్య, రిజ్వానా బేగం, మోహిజ్, మంజుల, జంగేష్, అంగన్‌వాడీ టీచర్లు ప్రేమలత, సులోచన, వనజ, జయమణి, ఆశా కార్యకర్తలు కరుణ, పద్మ, సంగీత, వీవోఏలు గోపాల్, చిత్కళ, గ్రామ నాయకులు, రైతులు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇరాన్ తో యుద్ధంలో నైతిక ఓటమిని ట్రంప్ అంగీకరించాలి

- **సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం**
- **కేంద్ర ప్రభుత్వం మెడలు వంచిన విద్యార్థి, యువత పోరాటం : సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్**
- **సీతారామ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయకపోవమే జిల్లాలో రైతులకు ఇబ్బందులు : సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**




**ఖమ్మం, జూలై 29, నేటి శుభోదయ :**
ఇరాన్ తో యుద్ధంలో అమెరికా నైతికంగా ఓడిపోయిందని, ఆ ఓటమిని ట్రంప్ అంగీకరించి వెంటనే ఒప్పందాలు చేసుకోవాలని సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు.స్థానిక సుందరయ్య భవనంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్ర శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని తమ్మినేని వీరభద్రం ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరాన్ పెట్టిన అన్ని నిబంధనలను అమెరికా అంగీకరిస్తుందని ట్రంప్ చెబుతూ పైకి మాత్రం యుద్ధంలో తమదే పై చేయి అంటున్నారని ఆయన అన్నారు. మేకపోతు గంభీరంలా ట్రంప్ వ్యవహారం ఉందని ఆయన అన్నారు. అందుకే యుద్ధంలో నైతికంగా అమెరికా ఓటమిని అంగీకరించాలని ఆయన అన్నారు. ఇంకా యుద్ధాన్ని కొనసాగిస్తే అమెరికా ఆర్థిక పరిస్థితి చిన్న భిన్నమయ్యే అవకాశా ఉందని,ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. యుద్ధం కారణంగా మిగిలిన దేశాలు కూడా ఇబ్బంది పడుతున్నాయని ఆయన అన్నారు. అందుకే ట్రంప్ ఓటమి అంగీకరించి చర్చలకు వచ్చి యుద్ధాన్ని ముగించాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజ్ సందర్భంగా దేశంలో ముఖ్యంగా ఢిల్లీలో యువత, విద్యార్థులు కలిసి చేసిన పోరాటం విజయవంతమైందని ఆయన అన్నారు. విద్యార్థుల యువత పోరాటానికి కేంద్ర ప్రభుత్వం తలవంచక తప్పలేదని అన్నారు. ఈ పోరాటం ఈ విజయం చారిత్రాత్మకమైనదని ఆయన అన్నారు. ఈ పోరాట స్ఫూర్తితో బిజెపి, ఆర్ఎస్ఎస్ మతోన్మాద శక్తులు వ్యతిరేకంగా పోరాటం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్ నినో పరిస్థితులను నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ఆయన అన్నారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో రైతులు ఈ సమస్య ఎదురు చూడడానికి సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయకపోవడమే కారణమని అన్నారు. సీతారాం ప్రాజెక్టు పూర్తి చేస్తుంటే రైతులకు ఖమ్మం జిల్లాలో త్రాగు, సాగునీటి సమస్య ఉండేది కాదని అందుకనే వెంటనే సీతారాం ప్రాజెక్టు పూర్తి చేయాలని అన్నారు.ఈ జిల్లా కమిటీ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాచర్ల భారతి, బండి రమేష్ , కళ్యాణం వెంకటేశ్వరరావు, వై విక్రమ్ భూక్య వీరభద్రం, మాదినేని రమేష్, బొంతు రాంబాబు, బండి పద్మ, మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 1న జాబ్ మేళా : జిల్లా ఉపాధి కల్పన అధికారిణి మాధవి

### -హరేకృష్ణ చారిటీ వారిచే జాబ్ మేళా నిర్వహణ

**ఖమ్మం, జూలై 29, నేటి శుభోదయ :**
ఉమ్మడి ఖమ్మం జిల్లా నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు హరేకృష్ణ చారిటీ వారిచే ఆగస్టు 1న శనివారం రోజున ఉదయం 10 గంటలకు ఖమ్మం టేకులపల్లి ప్రభుత్వ ఐటీఐ (Govt. ITI) ప్రాంగణంలోని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ (ATC) నందు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ జాబ్ మేళాలో డిస్ట్రిబ్యూషన్, ప్రొడక్షన్, మెయింటెనెన్స్, మిల్క్ ప్లాంట్, క్వాలిటీ, ఐటీ, పర్చేజ్, అకౌంట్స్, ఆపరేషన్స్ విభాగాల్లో ఇన్‌చార్జ్, ఎగ్జిక్యూటివ్, సూపర్‌వైజర్, టెక్నీషియన్, మేనేజర్ తదితర పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.ఐటీఐ, డిప్లొమా, బీటెక్, బీకాం, ఫుడ్ టెక్నాలజీ, కంప్యూటర్స్, హోటల్/హాస్పిటాలిటీ నేపథ్యంతో కూడిన ఏదైనా డిగ్రీ అర్హతలు కలిగి, సంబంధిత అనుభవం ఉన్న అభ్యర్థులు పోస్టును బట్టి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పోస్టులను బట్టి 18 నుండి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులని, ఎంపికైన వారికి 20 వేల నుండి 80 వేల వరకు నెలవారీ వేతనం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల ఖమ్మం జిల్లా నిరుద్యోగ యువతీ, యువకులు తమ విద్యార్హతల ధృవ పత్రాల జిరాక్స్ కాపీలు తీసుకొని ఆగస్టు 1న శనివారం నాడు నిర్వహించే జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు హరే కృష్ణ చారిటీస్ హెచ్ఆర్ సెల్ నెంబర్ 9372478535ను సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మ్మం జిల్లా పర్యటనకు విచ్చేసిన జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాకు ఘన స్వాగతం

- **పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**
- **ఎన్ఎస్పీ అతిథి గృహంలో పోలీస్ గౌరవ వందనం స్వీకరించిన లెఫ్టినెంట్ గవర్నర్**





**ఖమ్మం, జూలై 29, నేటి శుభోదయ :**
జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనకు విచ్చేశారు. జిల్లా పర్యటన సందర్భంగా ఎన్ఎస్పీ అతిథి గృహానికి చేరుకున్న లెఫ్టినెంట్ గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఘనంగా స్వాగతం పలికారు. పుష్ప గుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా ఆహ్వానించిన కలెక్టర్, అధికారుల తరపున శుభాకాంక్షలు తెలియజేశారు.ఎన్ఎస్పీ అతిథి గృహం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీస్ అధికారుల గౌరవ వందనాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్ లతో పాటు పలువురు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు లెఫ్టినెంట్ గవర్నర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.అనంతరం జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన లెఫ్టినెంట్ గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఖమ్మం జిల్లా సమగ్ర అభివృద్ధిపై విస్తృతంగా వివరించారు. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, వ్యవసాయ అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, మౌళిక సదుపాయాల విస్తరణ, గ్రామీణ, పట్టణాభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం తదితర అంశాలపై వివరించారు. అదేవిధంగా జిల్లా భౌగోళిక స్వరూపం, సహజ వనరులు, సాంస్కృతిక వారసత్వం, పారిశ్రామిక అవకాశాలు, ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల అమలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని కలెక్టర్ వివరించారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు.ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వివిధ కార్యక్రమాల్లో పాల్గొని, జిల్లా ప్రజల ఆతిథ్యానికి అభినందనలు తెలియజేసిన అనంతరం తన తదుపరి పర్యటన కార్యక్రమాలకు హైదరాబాదు బయలుదేరారు.ఈ కార్యక్రమంలో జిల్లా యంత్రాంగానికి చెందిన పలువురు అధికారులు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# పులిని కాపాడితేనే ప్రకృతి పరిరక్షణ

- అంతర్జాతీయ పులుల దినోత్సవంలో మంత్రి కొండా సురేఖ పిలుపు
- అమ్రాబాద్‌లో పులుల సంఖ్య పెరిగింది.. కవ్వాల్‌లో పునరావాస చర్యలు వేగవంతం






**మేడ్చల్ మల్కాజిగిరి , జూలై 29, నేటి శుభోదయ :** పులుల సంరక్షణను ప్రభుత్వాల బాధ్యతగా మాత్రమే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. పులిని పరిరక్షించడం అంటే అడవులను, పర్యావరణాన్ని, జీవవైవిధ్యాన్ని, భావి తరాల భవిష్యత్తును కాపాడటమేనని పేర్కొన్నారు.అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా దూలపల్లిలోని తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పులుల ఫోటో ప్రదర్శనను పరిశీలించి, పులుల సంరక్షణపై రూపొందించిన లఘు చిత్రాన్ని వీక్షించారు.సభలో మంత్రి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది జూలై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా పులుల సంరక్షణపై అవగాహన పెంపొందిస్తున్నట్లు తెలిపారు. వేట, అడవుల నరికివేత, అక్రమ రవాణా కారణంగా ఒక దశలో పులుల సంఖ్య ఆందోళనకరంగా తగ్గిపోయిందన్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు 1972లో వన్యప్రాణి సంరక్షణ చట్టం, 1973లో 'ప్రాజెక్ట్ టైగర్'ను ప్రవేశపెట్టడంతో దేశంలో పులుల సంరక్షణకు బలమైన పునాది పడిందని చెప్పారు.ప్రస్తుతం ప్రపంచంలోని మొత్తం పులుల్లో సుమారు 75 శాతం భారతదేశంలోనే ఉన్నాయని, దేశవ్యాప్తంగా 58 టైగర్ రిజర్వులు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. తెలంగాణలోని అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులు దేశంలోనే ప్రాధాన్యమైన అభయారణ్యాలుగా గుర్తింపు పొందాయని పేర్కొన్నారు.అమ్రాబాద్ టైగర్ రిజర్వులో నీటి వనరుల అభివృద్ధి, ఆవాసాల మెరుగుదల, ఆధునిక రక్షణ చర్యలతో పులుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. కవ్వాల్ టైగర్ రిజర్వులో పులుల సంఖ్యను పెంచేందుకు పునరావాస కార్యక్రమాన్ని చేపట్టామని, మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వుతో అనుసంధానం ద్వారా పులుల సహజ సంచారానికి అనుకూల పరిస్థితులు కల్పిస్తున్నామని వివరించారు.అడవుల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాలకు చెందిన శిక్షణార్థులను ఉద్దేశించి అటవీ సంపద పరిరక్షణలో నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.ఈ సందర్భంగా అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణలో విశేష సేవలందించిన అటవీ శాఖ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. అలాగే అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు.కార్యక్రమంలో అటవీదళాల ప్రధాన సంరక్షణాధికారి వినయ్ కుమార్, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వ విద్యాలయం ఉపకులపతి దండా రాజిరెడ్డి, పీసీసీఎఫ్ (అభివృద్ధి) రత్నాకర్ జౌహరి, తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ సంచాలకురాలు ప్రియాంక వర్గీస్, ఎన్. క్షితిజ్, టైగర్ సెల్ పరిశోధక శాస్త్రవేత్త అయాన్ సాధు, అమ్రాబాద్ ఫీల్డ్ డైరెక్టర్ ప్రసాద్, కవ్వాల్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు -అన్నదాన కార్యక్రమాలు

**వైరా, జూలై 29, నేటి శుభోదయ :** వైరా పట్టణం లోని సాయి నగర్ లో వున్న సాయి బాబా మందిరం శ్రీ హరిహర సుత అయ్యప్ప క్షేత్రం గండగల పాడు శిరిడి సాయిబాబా దేవాలయాల్లో బుధవారం గురు పౌర్ణమి వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు ఉదయం 6 గంటల నుండి కాకడ హారతి విశేష పంచామృత సహిత పండ్ల రసాలతో స్వామి వారికి అభిషేకాలు అలంకారాలు అర్చనలు సాయినాధి హోమము పల్లవి సేవ చావిడి ఉత్సవం అర్చన అష్టోత్తర పూజా కార్యక్రమాలు నిర్వహించారు సాయిబాబా మందిరంలో వచ్చిన భక్తులచే పాలాభిషేకం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని బాబా వారికి పాలాభిషేకం నిర్వహించారు వచ్చిన అర్చకులు భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించి గురు పౌర్ణమి విశిష్టతను వివరించారు వేద వ్యాస మూర్తి జన్మదినం గుర్తుగా పౌర్ణమి అంటారని సృష్టికి ఆధారమైన వేదాలను నాలుగు భాగాలుగా సులభతరం చేసి అందించినందుకు వేద మహర్షి వేద వ్యాసుడుని పిలవబడతారని తెలిపారు వ్యాసమహర్షి శ్రీ మహాభారత భాగవతం అష్టాదశ 18 పురాణాల్లో రచించారని ముఖ్యంగా హిందువులందరూ గ్రహించాల్సింది వ్యాసమహర్షి సనాతన చిరంజీవులు ఒకరైన వీరి అవతారానికి మరణం లేదని వ్యాస పూర్ణమి పర్వదినాన జగద్గురువులు చాతుర్మాస వ్రత ప్రారంభం వేద వ్యాసును పూజతో ప్రారంభిస్తారని తెలిపారు ఇప్పటికీ ఎప్పటికీ సృష్టిలో జీవించి ఉండే శ్రీ వ్యాస మోర్షిని గురు పౌర్ణమి రోజున అందరూ స్మరించాలని పూజించాలని వీరిని ఆరాధించాలని అంతేగాని మన ధర్మానికి సంబంధం లేని గురువులుగా భావించకూడదని ఈ సత్యాన్ని ప్రతి ఒక్కరు పిల్లలకు తెలియచేయాలని తెలిపారు సాయిబాబామందిరంలో గురువారం స్వామివారికి 108 కలశాలతో విగ్రహ నయనం అభిషేకం నిర్వహిస్తారని మహా పూర్ణహుతి కలశొద్వాసన మాల దీక్ష విసర్జన పండితులు ఆశీర్వచనం తీర్థప్రసాదులు ఉంటాయని అర్చకులు తెలిపారు దేవాలయాల్లో జరిగిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు సాయి బాబా అన్న ప్రసాద కార్యక్రమం లో మందిర చైర్మన్ పొడపాటి నాగేశ్వరరావు కోశాధికారి లగడపాటి బోస్ తల్లపురెడ్డి గోపాలకృష్ణారెడ్డి మిద్దె సుబ్బారావు నల్లమోతు వెంకటేశ్వరరావు నూకల శ్రీనివాసరావు దుర్గా ప్రసాద్ ప్రారంభించారు.మహిళా కౌంటర్ ను కౌన్సిలర్ సునీత మాదవి పద్మ తదితరులు ప్రారంభించారు.





# భారీ వర్షాలపై హైఅలర్ట్.. ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి

## - జిల్లా కలెక్టర్ అంకిత్

- రానున్న 36 గంటల్లో భారీ వర్షాల అవకాశం
- అన్ని శాఖల అధికారులు కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశం



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 29, నేటి శుభోదయ :** రానున్న 36 గంటల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. వర్షాల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బుధవారం సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పరిస్థితులను సమీక్షించారు. అధికారులు తమ కార్యస్థానాల్లో అందుబాటులో ఉంటూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.వరద ముంపు ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నదులు, వాగులు, కాలువలు, చెరువుల వద్దకు వెళ్లకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిని దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. రహదారులు, కల్వర్టులపై నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో ప్రజలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.తాగునీరు కలుషితమయ్యే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు సూచనలు అందించాలని, గ్రామీణ నీటి సరఫరా అధికారులు తాగునీటి పంపిణీకి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.విద్యుత్ అంతరాయం ఏర్పడినా ఆసుపత్రుల్లో వైద్య సేవలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు ఆదేశించారు. ప్రసవ సమయం సమీపించిన గర్భిణులను ముందుగానే సమీప ఆసుపత్రులు లేదా గర్భిణీ వసతి కేంద్రాలకు తరలించి అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు.

# అజ్ఞానమనే అంధకారాన్ని తొలగించి జ్ఞానజ్యోతులు వెలిగించేది గురువు

## - సమాజ వికాసంలో గురువుల పాత్ర అసమానం




**ఖమ్మం, జూలై 29, నేటి శుభోదయ :** గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక విజ్ఞాన్ విద్యాసంస్థలో బుధవారం గురుపూజోత్సవ వేడుకలు కన్నులపండువగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ ఎస్ వి సూర్య నారాయణ మాట్లాడుతూమన సంస్కృతిలో తల్లిదండ్రుల తర్వాత గురువుకే ప్రథమ ప్రాధాన్యం ఇచ్చామని,సనాతన ధర్మాన్ని, వేద జ్ఞానాన్ని జగత్తుకు అందించిన వేద వ్యాసుని జన్మదినాన్ని గురు పౌర్ణమిగా జరుపుకోవడం మన ఆనవాయితీ అని, గురువు చూపిన సన్మార్గంలో నడవడం ద్వారానే ప్రతీ ఒక్కరూ ఉన్నత శిఖరాలను చేరుకోగలరు అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యాసంస్థ ఉపాధ్యాయబృందానికి శుభాకాంక్షలు తెలియజేసారు.

# ఏసీపీ యాదగిరి రెడ్డి గురుపౌర్ణమి పూజలు



**నేరెడ్ మెట్ , జూలై 29, నేటి శుభోదయ :** గురుపౌర్ణమి సందర్భంగా మౌలాలిలోని గాయత్రినగర్ సాయిబాబా దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఏసీపీ యాదగిరి రెడ్డి ఆలయానికి విచ్చేసి సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఏసీపీ యాదగిరి రెడ్డిని శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. గురుపౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించగా, పెద్ద సంఖ్యలో భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో రాజేందర్ రావు, వెంకట్రామిరెడ్డి, దయాకర్, ఆంజనేయులు, కొండల్ రెడ్డి, శ్రీశైలం, నాగరాజు, అజయ్, విజయ్, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి, జూలై 29, నేటి శుభోదయ :** సంగారెడ్డి పట్టణంలోని 9వ వార్డులో గురు దత్తాత్రేయ సహిత సాయిబాబా దేవాలయంలో గురు పౌర్ణమి సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు వేద మంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు.‌‌___అనంతరం ఎమ్మెల్యే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా చింత ప్రభాకర్ మాట్లాడుతూ, భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం ఉందని, గురువులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు___గురు పౌర్ణమి పర్వదినం ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్ రెడ్డి, కౌన్సిలర్ లాడే మల్లేశం , 9 వ వార్డు బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి లాడే బాలు , సీనియర్ నాయకులు వేణుగోపాల స్వామి , పట్టణ కూర్మ సంఘం అధ్యక్షులు మల్లేశం , లాడే వెంకటేశం , మండల పార్టీ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, విఠల్ , కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

### -ప్రారంభించిన జిల్లా మెడికల్ విభాగం అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ




**వైరా, జూలై 29, నేటి శుభోదయ :** వైరా లోని 20వ వార్డులో వార్డు కౌన్సిలర్ ఉంద్రు వరలక్ష్మి శ్యామ్ బాబు ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ కేంద్రం ను ఖమ్మం జిల్లా డీసీసీ హెల్త్ సెల్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ ప్రారంభించారు ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ శిక్షణా కేంద్రం ద్వారా అర్హులైన 18 నుండి 25 లోపు యువతలకు శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికెట్ మరియు సబ్సిడీ ద్వారా కుట్టు మిషన్ ను అందజేయడం జరుగుతుందని తెలిపారు ఈ శిక్షణ కాలం మూడు నెలలు ఉంటుందని పదిమందిని మాత్రమే ముందు తీసుకుంటామని వుంద్రు వరలక్ష్మి తెలిపారు 20 వార్డు లో ఉన్న యువతులు దీని ఉపయోగించుకోవాలని ఆమె తెలిపారు అనంతరం దివ్యాంగునికి వీల్ చైర్ను లాప్టాప్ కు ఆర్థిక సహాయాన్ని అందించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ జిఈటి వుంద్రు శ్యాంబాబు జోన్ చైర్మన్ తోటకూర శ్రీకాంత్ ఏపూరి రాజారావు వైబుచ్చి రామారావు కొల్ల రాంబాబు కొదమూరు రవి బిక్య గంగవరపు కిషన్ పువ్వాళ రాము తదితరులు పాల్గొన్నారు

## గురుపౌర్ణమి వేళ రాష్ట్రపతి అవార్డు గ్రహీత నాగపత్తిని భాస్కర్ రావు కుఘన సన్మానం




**వైరా, జూలై 29, నేటి శుభోదయ :** వైరా మండలానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, రాష్ట్రపతి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శ్రీ నాగబత్తిని భాస్కరరావు గురుపౌర్ణమి సందర్భంగా ఘన సన్మానం అందుకున్నారు. ఖమ్మంలోని కాన్ రాయ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా చేతుల మీదుగా ఆయనకు జ్ఞాపికను అందజేసిసత్కరించారు.ఉపాధ్యాయ వృత్తిలో విశిష్ట సేవలు అందించిన నాగబత్తిని భాస్కర రావు అనేకసార్లు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందుకున్నారు. వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించి, పేద మరియు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు గురుకుల విద్యాసంస్థల్లో సీట్లు సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.విద్యా సేవలతో పాటు సామాజిక బాధ్యతను కూడా నిర్వర్తిస్తూ పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేయడం, బాల కార్మిక నిర్మూలన కోసం కృషి చేయడం, ఒక నెల జీతాన్ని విద్యార్థులసంక్షేమానికివిరాళంగా ఇవ్వడం, తన జీతంలో కొంత భాగాన్ని నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఖర్చు చేయడం వంటి సేవలు ఆయననుఆదర్శఉపాధ్యాయుడిగా నిలబెట్టాయి.ఇలాంటి సేవలను గుర్తించి గురుపౌర్ణమి రోజున ఆయనకు లభించిన ఈ సన్మానం ఉపాధ్యాయ వృత్తికే గౌరవాన్ని తీసుకువచ్చిందని పలువురు విద్యావేత్తలు, శిష్యులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

## వికారాబాద్ జిల్లాలో 78 శాతం ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తి - జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ




**వికారాబాద్, జూలై 29, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ ( ఎ స్ఐ ఆ ర్) ప్రక్రియలో భాగంగా 78 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్ (ఏఎస్డీ) కేసులను గుర్తించి సంబంధిత గ్రామపంచాయతీల నోటీస్ బోర్డులపై ప్రదర్శించినట్లు వెల్లడించారు. అలాగే వికారాబాద్, తాండూర్ ప్రాంతాల్లో వలస ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటంతో అలాంటి ఓటర్లను ప్రత్యేకంగా గుర్తించి వివరాలను నమోదు చేసే చర్యలు చేపట్టినట్లు వివరించారు.కలెక్టరేట్ నుంచి నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) సచిన్ బస్వరాజ్ గుట్టూరు, జిల్లా రెవెన్యూ అధికారి స్వర్ణలత, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నెమత్ అలీతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గురుభక్తి వెల్లివిరిసిన ఉద్దెమర్రి

### -శక్తి సాయి సాధనాలయంలో వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

- **పూజ్య సద్గురు శ్రీ సాయిరాజ్ బాబా ఆశీస్సులు.. వేలాదిగా తరలివచ్చిన భక్తులు**





**శామీర్‌పేట్, జూలై 29, నేటి శుభోదయ :** మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఉద్దెమర్రి గ్రామంలో ఉన్న శక్తి సాయి సాధనాలయ్–షిర్డీ సాయి ద్వారకామాయి ధ్యాన మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఆలయ వ్యవస్థాపకులు పూజ్య సద్గురు శ్రీ సాయిరాజ్ బాబా ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో షిర్డీ సాయిబాబా, శ్రీ గణపతి, శ్రీ దత్తాత్రేయ స్వామి, పరమశివుడు, కుమారస్వామి, దుర్గాదేవి, సరస్వతీ దేవి, మహాలక్ష్మిదేవి, శ్రీ ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, మహామంగళహారతులు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య సాగిన పూజా కార్యక్రమాలు భక్తులను ఆధ్యాత్మిక భావంలో ముంచెత్తాయి.ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి పూజ్య సద్గురు శ్రీ సాయిరాజ్ బాబా ఆశీర్వచనాలు అందించారు. ప్రతి మనిషిలో దయ, శాంతి, సత్యం వంటి విలువలు పెంపొందాలని, గురువు పట్ల భక్తి, దైవం పట్ల విశ్వాసం కలిగిన వారికే మోక్షమార్గం సులభమవుతుందని సూచించారు. సమాజంలో సౌభ్రాతృత్వం నెలకొనాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.సాయినామ స్మరణతో మారుమోగిన ఆలయంసద్గురు సాయిరాజ్ బాబా ఆధ్వర్యంలో జరిగిన సాయినామ జపం, భజనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బాబా స్వయంగా భక్తులతో కలిసి మహా మృత్యుంజయ మంత్రాన్ని జపింపజేయగా ఆలయ ప్రాంగణమంతా భక్తి పారవశ్యంతో మారుమోగింది. భక్తులు తన్మయత్వంతో జపంలో పాల్గొని ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు.భక్తి గీతాలతో అలరించిన భజన బృందంబాల గణపతి బొల్లారం భజన బృందం ఆలపించిన సాయిభక్తి గీతాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సాగిన భజనలు, హారతులు, అర్చనలు భక్తులను పరవశింపజేశాయి.అన్నదానంలో పాల్గొన్న భక్తులువేడుకల అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులందరికీ మహా అన్నప్రసాద వితరణ నిర్వహించారు. నల్గొండ, గ్రేటర్ హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, యాదాద్రి–భువనగిరి, సిద్దిపేట జిల్లాలతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొని సద్గురు ఆశీస్సులు పొందారు. భక్తుల రాకతో ఉద్దెమర్రి గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

## ఉపాధ్యాయుడి పాత్ర చిరస్మరణీయం : ఎంఈఓ,టిఎస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ



**వరంగల్, జూలై 29, నేటి శుభోదయ :** ఉపాధ్యాయ జీవితం ఆదర్శప్రాయమైనదని వరంగల్ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ),ఎస్.వెంకటేశ్వర్ రావు, టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు తాటికాయల అశోక్ కుమార్,చిలువేరు సృజన్ ప్రసాద్ రావు అన్నారు.మట్టెవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భగవద్గీత ఓరియంట్ విద్యాలయం ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులుగా దుద్యాల రవీందర్ పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారుఈ పదవి విరమణ కార్యక్రమానికి స్థానిక పాఠశాల ఉపాధ్యాయుడు వి. శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథులుగా.వరంగల్ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ),ఎస్.వెంకటేశ్వర్ రావు విచ్చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..స్థానిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయ ఇన్చార్జిగా పని చేసిన రవిందర్ అనతి కాలంలోనే 32 సంవత్సరాల విద్య శాఖలో మండలంలో అత్యున్నత విద్య ప్రమాణాలతో, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. పదవీ విరమణ పొందిన రవిందర్ శేష జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.ప్రభుత్వ ఉపాధ్యాయుల పదవీ విరమణ (రిటైర్మెంట్) వేడుకలను పాఠశాల సహచరులు, పూర్వ విద్యార్థులు మరియు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సన్మాన సభల్లో ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ జ్ఞాపికలు అందజేసి, వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షిస్తారు.ఈ ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నామోజు శ్రీనివాస్, కార్యదర్శి కందకట్ల రమేష్, వరంగల్ మండల ప్రధాన కార్యదర్శి, భాదావత్ శ్రీనివాస్, అల్లం వేణుమాధవ్, పోశాల కుమారస్వామి, ఎండి అంజాద్ అలీ, సంపేట సోమయ్య, కత్తి నాగన్న, వాసుదేవ్, ఎర్ర రవికుమార్, స్వామినాథ ఆచార్యులు ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, పాఠశాల సిబ్బంది బంధుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు

## ఓటర్లను చైతన్యం చేయడంలో రాజకీయ పార్టీల నాయకులు చొరవ తీసుకోవాలి

- **ఓటరు నమోదు కార్యక్రమాన్ని 100 శాతం చేపట్టడానికి సహకరించాలి**
- **అసర్ పై రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి**





**రాజేంద్రనగర్, జూలై 29, నేటి శుభోదయ :** ఓటరు జాబితాలో పేర్ల నమోదుకు ఇంకా ఐదు రోజులే మిగిలి ఉన్న నేపథ్యంలో రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయ పార్టీల నాయకులు జోక్యం చేసుకొని 100% ఓటర్లు తమ పేర్లు నమోదు చేసుకునేలా చైతన్యం తీసుకురావాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎలక్టోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈ ఆర్ ఓ), జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కోరారు. బుధవారం కిస్మత్ పూర్ లోని రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులు, అధికారులతో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోలిపేట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బుధవారం నాటికి రాజేంద్రనగర్ నియోజకవర్గం లో 57.2% ఓటర్ల పేర్లు డిజిటలైజ్ చేయడం జరిగిందన్నారు. 3. 62 లక్షల కు పైగా ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలను తిరిగి ఇవ్వడం జరిగిందన్నారు. చాలామంది ఓటర్లు నేటికీ తమ ఓటు గ్రామాలలో ఉంచుకోవాలా...? లేదా ఇక్కడ ఉండేలా చూసుకోవాలా అనే సందిగ్ధం లో ఉన్నారన్నారు. వాళ్ళందరికీ అవగాహన కల్పించి ఏదో ఒకచోట హోటర్ గా నమోదు అయ్యేలా చైతన్యం చేయాలన్నారు. 9 పోలింగ్ స్టేషన్ ల ప్రాంతాల మార్పు:హైదర్షా కోట్, బుద్వేల్, గంధం గూడ ప్రాంతాలలో ఎం పీ పీ స్కూల్ లలో ఉన్న పోలింగ్ బూత్ లను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లకు మార్చడం జరిగిందన్నారు. శంషాబాద్ లో రోడ్డుకు ఎడమ వైపు ఉన్న వారు రోడ్డు దాటి కుడి వైపు వెళ్ళి ఓటు వేయాల్సి ఉండేదని, ప్రస్తుతం అలా కాకుండా ఎడమ వైపు ననే ఓటు వేసేలా పోలింగ్ బూత్ ను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. 36 పోలింగ్ బూత్ లను ఇతర పోలింగ్ బూత్ లలో మెర్జింగ్ రాజేంద్రనగర్ నియోజకవర్గం లో 547 పోలింగ్ బూత్ లు ఉండగా వాటిలోని 36 పోలింగ్ కేంద్రాలను తగ్గించి పక్కనే ఉన్న మిగతా పోలింగ్ స్టేషన్ లలోకి మార్చడం జరిగిందన్నారు. అంటే ఇక మీదట నియోజకవర్గం లో 511 పోలింగ్ స్టేషన్ లే ఉంటాయన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

## బైక్ ప్రమాదంలో గాయపడిన బీఆర్ఎస్ యువ నాయకుడు శ్రవణ్ రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి, జూలై 29, నేటి శుభోదయ :** సంగారెడ్డి పట్టణానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు శ్రవణ్ రెడ్డి ఇటీవల బైక్ ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసు కున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ బుధవారం ఆయన నివాసానికి వెళ్లి ఆత్మీయంగా పరామర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లిన ఎమ్మెల్యే శ్రవణ్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ప్రమాదం ఎలా జరిగిందనే వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన త్వరగా పూర్తిగా కోలుకుని మళ్లీ ప్రజా సేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ధైర్యంగా ఉండాలనీ, పార్టీ తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.పరామర్శ అనంతరం శ్రవణ్ రెడ్డి ఇంట్లో ఉన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌తో మొదటిసారి MLA అయినా తరువాత దిగిన ఫొటోను చూపిస్తూ



ఆ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే ఆప్యాయంగా మాట్లాడి, ఎలాంటి అవసరం వచ్చినా సమాచారం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, వేణుగోపాల స్వామి, కౌన్సిలర్ లాడే మల్లేశం, 9వ వార్డు బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి లాడే బాలు, మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి,



విఠల్, పార్టీ కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, మోహన్ సింగ్ నాయక్, వాజిత్, చింటూ, సంగమేష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ భద్రత బిజెపితోనే సాధ్యం

- దేశానికి బిజెపి దిక్సూచి
- మరో 20 సంవత్సరాలు బీజేపీ ప్రభుత్వం పాలన
- నీట్ పరీక్ష పత్రం లీకేజీ కాంగ్రెస్ రాజకీయ కుట్ర
- తెలంగాణలో పేపర్ల లీకేజీ పైపులైను లీకేజీ
- పట్టించుకోని కాంగ్రెస్ ముఖ్యమంత్రి
- దేశాన్ని సుదీర్ఘంగా పాలించింది ఎవరు?
- దేశంలో కాంగ్రెస్ కుటుంబ రాజకీయాలు చెల్లవు
- తెదేశాన్ని ఇతర దేశాలకు తాకట్టు పెట్టడానికి కాంగ్రెస్ కుట్ర
- రాష్ట్ర బిజెపి సీనియర్ నాయకుడు మున్నూరు రవీందర్



**వనపర్తి, జూలై 29, నేటి శుభోదయ :** భారతదేశాన్ని 1947 నుంచి వరుసగా 1996 వరకు సుదీర్ఘంగా దేశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలించిన విషయం గుర్తుపె ట్టుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ దేశాన్ని విచ్ఛిన్నకర చేతుల్లో ఉగ్రవాదుల చేతుల్లో ప్రపంచ దేశాల చేతుల్లో తాకట్టు పెట్టడానికి కుట్ర చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఈ దేశ ప్రజలు అధికారంలోకి రాకుండా 1996 నుంచి 2026 నేటి వరకు వరుసగా భారతీయ జనతా పార్టీ ప్రధాన మంత్రులుగా దేశ ప్రజలు నమ్మకంతో విశ్వాసంతో గెలిపించిన విషయం గుర్తుపె ట్టుకోవాలని రాష్ట్ర బిజెపి పార్టీ సీనియర్ నాయకుడు ప్రముఖ సీనియర్ న్యాయవాది వనపర్తి జిల్లా కు చెందిన మున్నూరు రవీందర్ కాంగ్రెస్ వాదులకు గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం ఆయన నివాసంలో ప్రజా ప్రతిభ జర్నలిస్టుతో ఆయన కొద్దిసేపు ముచ్చటిస్తూ అనేక ఆసక్తి కరమైన విషయాలు బయట పెట్టారు. 1947 నుంచి ఈ దేశంలో ఆనాడు ప్రధానమం త్రిగా స్వర్గీయ జవహర్లాల్ నెహ్రూ 1964 వరకు పని చేశారని ఆ తర్వాత లాల్ బహుదూర్ శాస్త్రి 1964 నుంచి 1966 వరకు ప్రధానమంత్రిగా పనిచేశారని అదే విధంగా ఇందిరాగాంధీ 1966 నుంచి 1977, 1980, 1984 వరకు పని చేశారని ఆ తర్వాత ప్రధానమంత్రిగా మళ్లీ తిరిగి కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ ప్రధాని స్వర్గీ పివి నరసింహారావు 1991 నుంచి 1996 వరకు పనిచేయగా 1996 నుంచి 1998 వరకు బిజెపి పార్టీ నుంచి మాజీ ప్రధాని స్వర్గీయ అటల్ బీహార్ వాజ్పేయి ప్రధానమం త్రిగా పనిచేస్తూ 2004 వరకు ఈ దేశానికి ఆయన చేసిన సేవలు నేటికీ మరపురాని జ్ఞాపకాలుగా మిగిలిపోయినట్లు ఆయన పేర్కొన్నారు. ఆ తర్వాత తిరిగి మళ్లీ కాంగ్రెస్ ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ 2004 నుంచి 2014 వరకు పనిచేసిన విషయం ఆ పార్టీ రాష్ట్రస్థాయి జాతీయస్థాయి నాయకులు గుర్తుపెట్టుకోవాలని ఆయన సూచించారు. 2014 నుంచి 2026 వరకు ఈ దేశంలో బిజెపి ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ నాయకత్వంలో ఈ దేశం లో శాంతి భద్రతలు కాపాడుతూ ఈ దేశాన్ని దేశ ప్రజలను సురక్షితంగా సుభిక్షంగా కంటినిండా నిద్రపోయే విధంగా బిజెపి పాలన కొనసాగుతుందని అన్నారు. అలాంటి బిజెపి ప్రభుత్వాన్ని కుప్ప కూల్చడా నికి కాంగ్రెస్ పార్టీ కుట్రలు కుతంత్రాలు చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి రాబోయే 20 సంవత్సరాలు ఈ దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉండడం ఖాయమని ఆయన భీమ వ్యక్తం చేశారు.ఈ విధంగా ఈ దేశాన్ని అనేకసార్లు కాంగ్రెస్ ప్రభుత్వం పాలించి దేశాన్ని భ్రష్టు పట్టించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష పత్రం లీకేజీ పేరుతో దేశంలో అధికారం దాహం కోసం రాహుల్ గాంధీ చేస్తున్న కుట్రలు కుతంత్రాలు దేశంలోని యువత తిప్పి కొట్టిన సంగతి గుర్తు చేశారు. భారతీయ జనతా పార్టీ ఈ దేశంలో ఉగ్రవాదాన్ని, నక్సలిజం టెర్రరిజం, అణచివేస్తూ దేశ ప్రజల భద్రత కోసం దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు 24 గంటలు సుఖంగా నిద్రపోతున్న సంగతి ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ ప్రపంచంలోనే అతిపెద్ద పెద్ద కొడుకు అయినా అమెరికా దేశంతో చైనా దేశంతో ఒప్పందాలు పెట్టుకొని ఈ దేశాన్ని తాకట్టు పెట్టడానికి కుట్ర చేస్తుందని మున్నూరు రవీందర్ తీవ్ర స్థాయిలో ఆరోపించారు. ఈ దేశంలో కాక్రోస్ పార్టీ అధికారంలోకి రావడానికి కొంతమంది సపోర్ట్ మద్దతు పలుకుతున్నా రని ఆయన ఆరోపించారు. దేశంలో అన్ని వర్గాల అభ్యున్నతి కోసం లబ్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అభివృద్ధి పనులను చేపట్టిందని. కులాలకు మతాలకు అతీతంగా ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన ప్రజల సంక్షేమం కోసం బిజెపి పార్టీ కట్టుబడి పని చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వంశపరంపరమైన రాజకీయాలు ఈ దేశంలో చేస్తుందని అందుకు నిదర్శనం మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ జవహర్లాల్ నెహ్రూ ఆ తర్వాత మాత్మ గాంధీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఈ విధమైన వారసత్వ రాజకీయాలు కాంగ్రెస్ పార్టీ చేస్తుందని భారతీయ జనతా పార్టీలో వంశపరమైన రాజకీయాలు వారసత్వం రాజకీయాలు ఎక్కడ కూడా చేయలేదని గుర్తు చేశా. అధికార దాహం కోసం దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం పుట్టలు కుతంత్రాలు చేస్తూ యువతను రెచ్చగొడు తుందని అయినా కూడా ఈ దేశ ప్రజలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీసుకున్న నిర్ణయాలకు సోషల్ మీడియాలో కోట్లాది మంది ప్రజలు యువకులు నరేంద్ర మోడీకి మద్దతుగా నిలిచిన విషయం గుర్తు చేశారు. నీట్ పరీక్ష పత్రం లీకేజీ పైన బిజెపి ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకున్న సంగతి కూడా గుర్తు చేశారు. దేశంలో ఎక్కడ కూడా పరీక్ష పత్రం లీకేజీ జరుగుతే 10 కోట్ల రూపాయలు జరిమానా తో పాటు పది సంవత్సరాల జైలు శిక్ష విధించడానికి భారతీయ జనతా పార్టీ పార్లమెంటులో ప్రత్యేక చట్టం తెస్తుందని సంగతి కూడా గుర్తు చేశారు. ఇలాంటి గొప్ప సహసోపేత మైన నిర్ణయం బిజెపి ప్రభుత్వం తీసుకున్న సంగతి దేశంలోని యువత మేధావులు విద్యావంతులు గుర్తిస్తున్న సంగతి ఆయన గుర్తు చేశారు. ప్రపంచ దేశాలకు ఈ దేశాన్ని తాకట్టు పెట్టి కాంగ్రెస్ ఈ దేశాన్ని అమ్ముకో వడానికి కుట్ర చేస్తుందని ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రపంచ దేశాలలో చైనా దేశం అన్ని దేశాలపై ఆధిపత్యం చేస్తున్న కూడా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చైనా ,అమెరికా దేశాల కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టిన సంగతి ప్రతి ఒక్కరు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ఈ దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వస్తే భారతదేశం చైనా దేశానికి అమ్ము కోవడం ఖాయమని ఆయన జోష్యం చెప్పారు. అంతేకాక భారతదేశంలోని యువత ఇతర దేశాలలో ఉపాధి కోసం ఉద్యోగాల కోసం వెళ్లకుండా మనదేశంలోనే అన్ని వసతులు కల్పిస్తూ ఈ దేశంలోని యువతకు బిజెపి ప్రభుత్వం ఉద్యోగపరమైన ఉపాధిపరమైన అవకాశాలు కల్పిస్తుందని మున్నూరు రవీందర్ సూచించారు. అన్ని అవకాశాలు బిజెపి ప్రభుత్వంలోని యువతకు ఈ దేశంలో లభిస్తాయని అందులో ఎలాంటి అనుమానం లేదని అన్నారు. నీట్ పరీక్ష పత్రం లీకేజీలో నింది తులను ఇప్పటికే అరెస్ట్ చేయడం జరిగిందని దోషులకు కఠిన శిక్షలు విధించడం జరుగు తుందని ప్రశ్నాపత్రం లీకేజీ పైన పార్లమెం టులో బిజెపి చర్చకు సవాల్ విసిరిన కూడా కాంగ్రెస్ పార్టీ భయపడి పోయిందని ఆ సంగతి కూడా గుర్తుపెట్టుకోవాలని సూచించారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని దేశంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేంద్రంలోని బిజెపి పార్టీ ప్రభు త్వానికి పూర్తి మద్దతు ప్రకటిస్తూ మోడీ ప్రభుత్వం అడుగుజాడలో పయనించాలని ఆయన సూచించారు..

## రైతు బజార్ బురదమయం.. మౌలిక వసతుల కొరతతో రైతులు, వినియోగదారుల అవస్థలు



**వికారాబాద్, జూలై 29, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా ప్రధాన వర్తక కేంద్రంగా గుర్తింపు పొందిన రైతు బజార్ ప్రస్తుతం మౌలిక వసతుల లేమితో దయనీయ స్థితికి చేరుకుంది. జిల్లాలోని రైతులు తమ పంటలను నేరుగా విని యోగదారులకు విక్రయించే ఈ రైతు బజార్, ఆదర్శ మోడల్ మార్కెట్‌గా ఉండాల్సిన చోట బురదమ యంగా మారి తీవ్ర అసౌకర్యా లకు కారణమవుతోంది.చిన్న పాటి వర్షం కురిసినా రైతు బజార్ అంతా బురదతో నిండిపోవడంతో కూరగాయలు విక్రయించే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బురదలోనే కూరగాయలను విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడటంతో పరిశుభ్రత కూడా దెబ్బతింటోంది. మరోవైపు కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చే ప్రజలు బురదలో నడవలేక తీవ్ర అసౌకర్యా నికి గురవుతున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు జారిపడే ప్రమాదం కూడా నెలకొంది.రైతు బజార్‌లో సరైన డ్రైనేజీ వ్యవస్థ, పక్కా అంతర్గత రహదారులు, వర్షపు నీరు నిల్వ కాకుండా చేసే ఏర్పాట్లు లేకపోవడంతో ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పున రావృతమవుతోంది. జిల్లాలో అత్యంత ముఖ్యమైన వ్యాపార కేంద్రాల్లో ఒకటైన రైతు బజార్‌కు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.రైతులు, వినియోగదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రైతు బజార్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి, బురద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ప్రజలు, రైతులు ప్రభుత్వాన్ని కోరుతు న్నారు.

## షాబాద్ సిఐ లక్ష్మి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు



**షాబాద్, జూలై 29 , నేటి శుభోదయ :** షాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మి రెడ్డిని స్థానిక ప్రముఖులు కొళ్ల యాదయ్య, ప్రవీణ్ గౌడ్, కృష్ణ, శ్రీనివాస్, సత్తయ్య, యాదయ్య, నవీన్, క్రాంతి తదితరులు మర్యాదపూర్వ కంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి అభినం దనలు తెలియజేసిన నాయకులు, షాబాద్ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంలో విజయవంతం కావాలని ఆకాంక్షిం చారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించి, ప్రజలకు నమ్మకమైన పోలీసు వ్యవస్థను అందించాలని కోరారు.సమావేశంలో మండలంలోని శాంతిభద్రతల పరిస్థితులు, ట్రాఫిక్ నియంత్రణ, మహిళలు, విద్యార్థుల భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణ, యువతలో చట్టాలపై అవగాహన కల్పించడం, సీసీ కెమెరాల విస్తరణ, గ్రామాల్లో పోలీసు–ప్రజల సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై చర్చించారు.స్థానిక నాయకులు మాట్లాడుతూ, నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతాభావం పెంపొందించేందుకు పోలీసు శాఖ చేపడుతున్న చర్యలకు తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొనేలా ప్రజలను చైతన్యపరచడంలోనూ ముందుంటామని పేర్కొన్నారు.ఎస్‌హెచ్‌వో లక్ష్మి రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పారదర్శకంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించడమే తమ లక్ష్యమని అన్నారు. చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూనే, బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు చేపడతామని తెలిపారు. శాంతిభ ద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, అనుమానాస్పద వ్యక్తులు, మాదకద్రవ్యాల విక్రయాలు లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## డాగ్ స్క్వాడ్‌తో మాదకద్రవ్యాలపై ప్రత్యేక తనిఖీలు -అవగాహన కార్యక్రమం నిర్వహించిన షాబాద్ పోలీసులు



**షాబాద్, జూలై 29, నేటి శుభోదయ :** షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా షాబాద్ సీఐ లక్ష్మి రెడ్డి ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ సహకారంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎస్సై చెన్నారెడ్డి, షాబాద్ మండలంలోని కుర్వగూడ సర్పంచ్ బుయ్యని సంధ్యారాణి మల్లికార్జున్, లక్ష్మా రావుగూడ సర్పంచ్ శ్రీరంగాపురం కుమార్ గ్రామాల్లో డ్రగ్స్, సైకోట్రోపిక్ పదార్థాల వినియోగం, అక్రమ రవాణా, నిల్వ మరియు విక్రయాలను అరికట్టేం దుకు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.గ్రామంలోని ప్రధాన కూడళ్లు, అనుమానాస్పద ప్రాంతాలు, నిర్మానుష్య ప్రదేశాలు, యువత ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి అక్రమ మాదకద్రవ్యాలు లభించకపోయినప్పటికీ, ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతా యని పోలీసులు స్పష్టం చేశారు.అనంతరం గ్రామస్తులు, యువతతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, ఆర్థిక, సామాజిక దుష్పరిణామాలను వివరించారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే కుటుంబాలు, భవిష్యత్ జీవితం, విద్య, ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు.ఎవరైనా డ్రగ్స్, గంజాయి లేదా ఇతర నిషేధిత మాదక పదార్థాల విక్రయం, నిల్వ, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్–100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రతి గ్రామాన్ని డ్రగ్స్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నా రని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిత్యం దృష్టి ఉంచాలని, అనుమా నాస్పద మార్పులు గమనిస్తే వెంటనే స్పందించాలని సూచించారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులు పోలీసుల చర్యలను అభినందిస్తూ మాదకద్రవ్యాల నిర్మూల నకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, డాగ్ స్క్వాడ్ బృందం, గ్రామ పెద్దలు, యువత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## స్వర్గీయ పరిమి వెంకయ్య దశదినకర్మలో ఘన నివాళులు..

**- కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు**



**కూకట్‌పల్లి , జూలై 29, నేటి శుభోదయ :** కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నెం.3లో నివాసముంటున్న పి.వి. శ్రీ రమణ తండ్రి స్వర్గీయ పరిమి వెంకయ్య దశదినకర్మ కార్యక్రమం బుధవారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా స్వర్గీయ పరిమి వెంకయ్య చిత్రపటానికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కట్టెల మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షులు వంగాల కొండల్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మహేందర్, కూకట్‌పల్లి అధ్యక్షులు ఎర్ర యాకయ్య పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం స్వర్గీయ వెంకయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించి, పి.వి. శ్రీ రమణతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కూకట్‌పల్లి ప్రధాన కార్యదర్శి నాగుల అంజిబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగార్జున, ఈసీ సభ్యులు సుజాత, అనిల్ కిషోర్, శివ, రామకృష్ణ, బి. శ్రీధర్, జి. శ్రీధర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞాన జ్యోతులు వెలిగించేది ఒక గురువు మాత్రమే



**ఏన్కూర్, జూలై 29, నేటి శుభోదయ :** గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏన్కూరు మండల కేంద్రంలో సాయిబాబా ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..... తల్లిదండ్రుల తర్వాత గురువే ప్రథమ ప్రాధాన్యత ఇచ్చామని సనాతన ధర్మాన్ని వేద జ్ఞానాన్ని అందించిన వేదవ్యాసుడు జన్మదినాన్ని గురు పౌర్ణమి గా జరుపుకోవడం సంతోషంగా ఉందని ఆమె అన్నారు .అందరికీ గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవుల నరసయ్య ,ముదిగొండ నాగేశ్వరరావు, చందమామ నరసింహారావు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## కులాన్ని బట్టి గౌరవిస్తారా..?




**ఏన్కూర్, జూలై 29, నేటి శుభోదయ :** నాయకులు దగ్గర నుంచి అధికారులు వరకు కులాన్ని బట్టే గౌర విస్తార ని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆలయాల్లో అయితే అర్చకులు అగ్రవర్ణాలకు ఒక రీతు లో మిగతా కులాల కు ఒక రీతిలో పూజలు చేస్తారని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఈ విషయమై ఇటీవల ఏన్కూరు మండల కేంద్రంలోని ఒక ప్రధాన సెంటర్లోని టీ స్టాల్ లో చర్చ కూడా నడిచింది . ఇదే విషయంపై "నేటి శుభోదయ"పత్రిక వాస్తవాలను ఆరా తీసింది. విలేకరులపై కూడా కుల వివక్షత రాజకీయ నాయకులు చూపుతున్నారని విషయం వెల్లడైంది. పై స్థాయి కులాలకు చెందిన విలేకరులను గౌరవ మర్యాదలుస్తూ మిగతా కులాలకు సంబంధించిన విలేకరులను గౌరవ మర్యాద ఇవ్వటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కులాలను బట్టే వ్యక్తులను గౌరవిస్తారా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలు, బీసీ ఓట్ల వరకే పరిమితం తర్వాత గౌరవం ఉండదు. కింది స్థాయి కులాల యువ కులను పెద్దగా పట్టించుకునే నాధుడే ఉండరు అనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ యువకులు పట్లా చులకనగా చూస్తారు అనే విమర్శలు ఉన్నాయి. స్వతంత్రం వచ్చి ఇన్ని ఏండ్లు అయినా మా జీవితాలు ఇలానే ఉంటాయి. విలేకరుల ను సైతం కులాలను బట్టి గౌరవిస్తూ ఉన్నారంటే మనం ఏ సమాజంలో ఉన్న అర్థం చేసుకోవచ్చు అంటూ పలువురు మేధావులు అభిప్రాయపడ్డారు.

## మాజీ మేయర్ ఖాళీ స్థలంపై నిర్లక్ష్యం

- **మురుగునీరు నిల్వ, దోమల వ్యాప్తి, సీజనల్ వ్యాధుల ముప్పు**
- **కార్పొరేషన్ పలుమార్లు నోటీసులు ఇచ్చినా పట్టించుకోని మాజీ మేయర్**
- **ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు**





**ఖమ్మం, జూలై 29, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలోని 50వ డివిజన్‌లో మాజీ మేయర్‌కు చెందిన సుమారు 500 గజాల ఖాళీ స్థలం ప్రస్తుతం స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు కారణంగా మారిందని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థలం పూర్తిగా నిర్లక్ష్యానికి గురికావడంతో వర్షపు నీరు, మురుగునీరు నిల్వ ఉండటమే కాకుండా చెట్లు పెరిగి భారీగా చెత్తాచెదారం పేరుకుపోయిందని, దీనివల్ల దోమలు విపరీతంగా పెరిగి సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం నెలకొందని స్థానికులు చెబుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి పరిస్థితి మరింత దిగజారిందని, స్థలమంతా పొదలు, కలుపు మొక్కలు పెరిగిపోవడంతో విషపురుగులు, పాములు సంచరించే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఈ పరిస్థితి మరింత ఇబ్బందిగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల ఫిర్యాదుల మేరకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పలుమార్లు ఆ స్థలాన్ని పరిశుభ్రం చేయాలని యజమానికి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. పారిశుధ్య సిబ్బంది కూడా పలుమార్లు నేరుగా వెళ్లి పరిస్థితిని వివరించి, వెంటనే చెత్త తొలగించి స్థలాన్ని శుభ్రం చేయాలని సూచించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది. స్థలంలో నిల్వ ఉన్న మురుగు నీరు దోమల పెరుగుదలకు అనుకూలంగా మారిందని, ఇప్పటికే డెంగ్యూ, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు వంటి సీజనల్ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి నిర్లక్ష్యం ప్రజారోగ్యానికి ప్రమాదకరంగా మారుతుందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. సామాన్య ప్రజలకు కార్పొరేషన్ నిబంధనలు కచ్చితంగా అమలు చేసే అధికారులు, ప్రజాప్రతినిధులుగా పనిచేసిన వారిపైనా అదే విధంగా చర్యలు తీసుకోవాలి. మాజీ మేయర్ అనే హోదాతో బాధ్యత మరింత ఎక్కువగా ఉండాలి కానీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదని ఆ ప్రాంతవాసులు అభిప్రాయపడుతున్నారు.మాజీ మేయర్ అన్న అహంభావంతో అధికారుల సూచనలను ఏమాత్రం పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారనే విమర్శలు స్థానికంగా వినిపిస్తున్నాయి. పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ వాటిని లెక్కచేయకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.వర్షాకాలంలో ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్న సమయంలో ఇలాంటి ఖాళీ స్థలాలు వ్యాధులకు కేంద్రాలుగా మారకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి స్థల యజమానిపైనా ఉందని స్థానికులు గుర్తుచేస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే కార్పొరేషన్ స్వయంగా స్థలాన్ని శుభ్రం చేసి ఖర్చును సంబంధిత యజమాని నుంచి వసూలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా అధికారులు తక్షణమే స్పందించి ఆ స్థలాన్ని పరిశుభ్రం చేయించి, భవిష్యత్తులో ఇలాంటి నిర్లక్ష్యం పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని 50వ డివిజన్ ప్రజలు కోరుతున్నారు.

## పోరాటాలు, నిరసనలు ప్రజల హక్కు

- **ద్రనిర్బంధాలతో అణిచివేస్తే పతనం తప్పదు**
- **శృతిమించుతున్న మతోన్మాదుల వ్యాఖ్యలు**
- **సిపిఐ శిక్షణా తరగతుల్లో బాగం**





**ఖమ్మం, జూలై 29, నేటి శుభోదయ :** ప్రజాస్వామ్య దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసనలు తెలపడం, సానుకూల పోరాటాలు నిర్వహించడం ప్రజల హక్కు అని దానికి భంగం కలిగించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని సిపిఐ జాతీయ –సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై హింసాత్మక చర్యలకు పాల్పడటం, అక్రమంగా కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. బుధవారం ఖమ్మం నియోజక వర్గ స్థాయి సిపిఐ సభ్యుల –శిక్షణా తరగతులు స్థానిక జివిఆర్ ఫంక్షన్ హాల్లో జరిగాయి. శిక్షణా తరగతులకు ముందు సిపిఐ పతాకాన్ని ఖమ్మం –నియోజక వర్గ కార్యదర్శి ఎస్ కె జానిమియా ఆవిష్కరించారు. పగడాల మల్లేష్ ప్రిన్సిపాల్గా వ్యవహరించిన ఈ శిక్షణా తరగతుల్లో ప్రస్తుత రాజకీయాలు– కమ్యూనిస్టుల పాత్ర అనే అంశాన్ని హేమంతరావు బోధిస్తూ లక్షలాది మంది విద్యార్థుల –జీవితాలతో చెలగాటమాడిన నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి జరిగిన ఆందోళనలపై మోడీ సర్కార్ ఉక్కుపాదం మోపిందని పాశవికంగా అణిచివేసే ప్రయత్నం చేసిందన్నారు. ప్రజాస్వామ్య హక్కును కాలరాసే అధికారం ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీలో జరిగిన హింసాత్మక ఘటనలకు సంబంధించి న్యాయ విచారణ జరిపించాలని, అక్రమంగా –నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో మరో ఉద్యమం పురుడుపోసుకోక తప్పదన్నారు. బిజెపి ప్రజాప్రతినిధులు విశ్వ హిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ నేతలు ఉన్మాద చర్యలను ప్రేరేపిస్తున్నాయని బిజెపి ఎంపి కంగన రనౌత్ –విద్యార్థి, యువజనుల ఆందోళన పట్ల చేసిన వ్యాఖ్యలు అర్థరహితమనీ, యువతను ఆమె అవమానించిందని హేమంతరావు –తెలిపారు. విశ్వ హిందూ పరిషత్ కు చెందిన మోహన్ దాస్ మరింత జుగుప్సాకరంగా వ్యాఖ్యానించారని ఆయన తెలిపారు. దేశంలోని మహిళలు అత్యాచారాలను అస్వాదిస్తున్నారని వ్యాఖ్యానించడం ద్వారా మోహన్దాస్ దేశ మహిళలను "అవమానించారని దీనికి బిజెపి సమాధానం చెప్పాలన్నారు. ఢిల్లీ ఆందోళనలో పాల్గొన్న వారిని నేను కాల్చి పాడేసే వాడినన్న –మోహన్దాస్ వ్యాఖ్యలపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని హేమంతరావు డిమాండ్ చేశారు. మారిన పరిస్థితుల్లో –దేశంలో ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయని, సంపద కొంత మంది చేతుల్లో పోగుపడుతూ పేదలు మరింత పేదలు అవుతున్నారన్నారు. మోడీ కార్పొరేట్ల కోసమే పాలన సాగిస్తున్నారని, కార్పొరేట్ల కోసమే చట్టాలు చేస్తున్నారని, కార్పొరేట్ల కోసమే –మోడీ, షా లు జీవిస్తున్నారని ఆయన తెలిపారు. పెరిగిన నిరుద్యోగం, ఆర్థిక అంతరాలు, వ్యవసాయ రంగ సంక్షోభం, లేబర్ కోడ్స్, ఉపాధి లేమి భవిష్యత్తు ఉద్యమాలకు దారి తీస్తుందని దీనిని ఎదుర్కొనేందుకు ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని, –అణిచివేత కొనసాగితే పతనం తప్పదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిందని రాను రాను ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోతుందని హేమంతరావు తెలిపారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని, –రుణ మాఫీ, రైతుబంధు, రైతు బీమాతో పాటు మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. దేశంలో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతున్న నేపథ్యంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పోరాట కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలన్నారు. స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కారానికి పోరాటాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు మరింత –దగ్గర కావాలని ఆకాంక్షించారు. ఈ శిక్షణా తరగతుల్లో పార్టీ నిర్మాణం, ఆందోళనలు– ప్రచారం అనే అంశాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జాతీయోద్యమం– కమ్యూనిస్టు పార్టీ పాత్ర అనే అంశాన్ని జమ్ముల జితేందర్రెడ్డి, కులం, మతం వర్గ పోరాటం అనే అంశాన్ని శింగు నర్సింహారావు బోధించారు. ఈ శిక్షణా తరగుతల్లో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఏపూరి –లతాదేవి, మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, మేకల శ్రీనివాసరావు, ఏనుగు గాంధీ, –యానాలి సాంబశివరెడ్డి, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు బత్తినేని నీరజ, పెద్ద సంఖ్యలో సిపిఐ సభ్యులు, జిల్లా సమితి –సభ్యులు పాల్గొన్నారు.

# ఆగస్టు 4న జరిగే ఎంఆర్‌పిఎస్

## - ఎంఎస్పీ రూరల్ నియోజకవర్గ సదస్సును విజయవంతం చేయాలి

- భారీగా తరలిరావాలని పిలుపు










**నిజామాబాద్ రూరల్ సిరికొండ, జులై 29, నేటి శుభోదయ :** ఆగస్టు 4న ఇందల్వాయి మండలం తీర్మాన్‌పల్లి గ్రామంలోని గౌడ సంఘ భవనంలో నిర్వహించనున్న ఎంఆర్‌పిఎస్–ఎంఎస్పీ రూరల్ నియోజకవర్గ సదస్సును విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సిరికొండ మండలం తాటిపల్లి, జీనిగాల, న్యావనంది గ్రామాల్లో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్పీ ముఖ్య నాయకులు సిరికొండ మండల అధ్యక్షుడు మొట్టల దీపక్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సమావేశంలో ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జులు, జిల్లా సీనియర్ నాయకులు గంధమాల నాగభూషణం మాదిగ, చెవురి శ్యామ్ మాదిగ మాట్లాడుతూ, రూరల్ నియోజకవర్గ సదస్సు ఉద్యమ భవిష్యత్ కార్యాచరణకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. సిరికొండ మండలంలోని అన్ని గ్రామాల నుంచి మాదిగ సోదరులు, యువకులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు.అనంతరం వారు మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చేపడుతున్న సామాజిక న్యాయ పోరాటం, ఎస్సీ వర్గీకరణ అవసరం, దళిత–బహుజన హక్కుల సాధన కోసం కొనసాగుతున్న ఉద్యమాల గురించి కార్యకర్తలకు వివరించారు. అలాగే రానున్న రోజుల్లో ఎంఆర్‌పిఎస్ చేపట్టనున్న ఉద్యమాలు, సంస్థ బలోపేతానికి చేపట్టే కార్యక్రమాలపై సమగ్ర అవగాహన కల్పించారు.సదస్సు విజయవంతం కోసం ప్రతి గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించి, ప్రజలను సమీకరించాలని నాయకులు సూచించారు. ప్రతి కార్యకర్త బాధ్యతగా వ్యవహరించి సదస్సు విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిచ్‌పల్లి ఇన్‌చార్జి డప్పు నర్సయ్య, ఇందల్వాయి ఇన్‌చార్జి సంగెం కిష్టయ్య, నాయకులు ఇంద్ర కుమార్, రాజశేఖర్, ఎంఆర్‌పిఎస్ కమిటీ సభ్యులు, తాటిపల్లి గ్రామానికి చెందిన మాదిగ కులస్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



**మిడ్జిల్, జూలై 29, నేటి శుభోదయ :** మిడ్జిల్ మండలంలోని మున్ననూర్ గ్రామానికి చెందిన BRS మండల నాయకులు కాకునూరు జై పాల్ రెడ్డి తండ్రి ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి పరామర్శించారు.అనంతరం ఇటీవల అనారోగ్యంతో సర్జరీ చేయించుకున్న ఆంద్ర రాఘవ రెడ్డితో పాటు కుచ్చర కంటి రాఘవ రెడ్డి తండ్రి గత మూడు రోజులక్రితం మరణించడంతో వారి కుటుంబ సభ్యులను కూడా.పరామర్శ పరామర్శించారు.ఈ కార్యక్రమంలో BRS మండల అధ్యక్షులు పాండు యాదవ్, మాజీ ఎంపీపీ సుదర్శన్, మాజీ జెడ్పిటిసి శశిరేఖ బాలు, దోనూర్ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, యూత్ వింగ్ అధ్యక్షులు బంగారు, మండల బిఆర్ఎస్ నాయకులు జగన్ గౌడ్, నామాని శ్రీనివాసులు, శేఖర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, మల్లయ్య మధు, యాదయ్య, బాల్ రాజ్, అమృతయ్య, వెంకటయ్య, మహేష్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సంపన్న ప్రక్రృతే భావి వారసత్వం




**ఖమ్మం, జూలై 29, నేటి శుభోదయ :** మన భావి తరాలకు సంపన్న ప్రక్రృతిని వారసత్వం గా అందించాల్సిన బాధ్యత ఈనాటి విద్యార్థులపై ఉందని ఖమ్మం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.బాలరాజు అన్నారు. బుధవారం ప్రపంచ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఆర్ బిజి ఎన్ఆర్ కళాశాల జువాలజివిభాగం–ఎకోక్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వన్యప్రాణుల సంరక్షణ – యువత బాధ్యత అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని విద్యార్థులకు సందేశాన్ని అందించారు.వన్యప్రాణుల అక్రమ వేటను నిరోధించడం పర్యావరణ పరిరక్షణ లో విద్యార్థులు తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు.ఎకోసిస్టమ్ లో పులుల ప్రాధాన్యతను వివరించారు.కార్యక్రమంలో జువాలజీ విభాగాధిపతి డా.బి.చెంచురత్నయ్య, ఐ.క్యూఏసి కోఆర్డినేటర్ డా.ఎం.సునంద ఎకో క్లబ్ కన్వీనర్ ఎస్.ఇంద్రాణి , అధ్యాపకులు ఏం.శ్రీనివాసశరీన్,బి.వెంకటేశ్వర్లు,డా.బి.కవిత వివిధ విభాగాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య, అత్యాధునిక వసతులు కల్పన

## - రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- విద్యార్థుల భవిష్యత్తుపై పెట్టుబడే అసలైన అభివృద్ధి
- రూ.4.85 కోట్లతో గొల్లగూడెం ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి





**ఖమ్మం, జూలై 29, నేటి శుభోదయ :** ప్రభుత్వ విద్యా రంగంలో విద్యార్థులకు అత్యుత్తమ విద్యతో పాటు అన్ని వసతులు కల్పించి, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా పోటీపడే స్థాయికి ఎదగాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.పాలేరు నియోజకవర్గంలో బుధవారం విస్తృతంగా పర్యటించిన మంత్రి ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గొల్లగూడెం ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో రూ.4 కోట్ల 85 లక్షల వ్యయంతో అదనపు వసతి గృహం, డైనింగ్ హాల్, వంటగది, అదనపు తరగతి గదులు, టాయిలెట్ బ్లాక్‌లు, వంట షెడ్లు, ఓవర్ హెడ్ ట్యాంక్, సోలార్ ఫెన్సింగ్ తదితర మౌళిక వసతుల నిర్మాణ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు అత్యుత్తమ విద్యతో పాటు అన్ని వసతులు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పేద కుటుంబాల్లో జన్మించిన పిల్లలు కూడా కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులతో సమానంగా పోటీపడే స్థాయికి ఎదగాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ విద్యాసంస్థలను నాణ్యమైన విద్యకు కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్య అందించాలనే సంకల్పంతో భారీ స్థాయిలో నిధులు కేటాయించామని అన్నారు. ఈ పాఠశాలలో రూ.4.85 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత విద్యార్థినులకు మరింత మెరుగైన వసతి, భద్రత, పరిశుభ్రత, విద్యా వాతావరణం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుపై పూర్తి దృష్టి సారించేలా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు.పేదరికం కారణంగా చదువు ఆగిపోవద్దనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి తమ పిల్లలను మంచి చదువులు చదివించాలని ఆశతో ఆశ్రమ పాఠశాలలకు పంపుతున్నారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత విద్యార్థులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థినులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని చదువును జీవిత లక్ష్యంగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని, విద్య మాత్రమే జీవితాన్ని మార్చగల శక్తి అని అన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి నాణ్యమైన విద్య, మంచి విలువలు అందించాలని కోరారు. ప్రతి విద్యార్థిని సమాజానికి ఆదర్శంగా నిలిచే వ్యక్తిగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.ఐటీడీఏ అధికారులు ప్రత్యేక శ్రద్ధతో ఆశ్రమ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నారని మంత్రి అభినందించారు. వ్యక్తిగత ఆసక్తితో పాఠశాలల్లో దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయడం అభినందనీయం అని అన్నారు.ప్రభుత్వం విద్యను సంక్షేమ కార్యక్రమంగా మాత్రమే కాకుండా రాష్ట్ర భవిష్యత్తును నిర్మించే పెట్టుబడిగా భావిస్తోందని, పేద కుటుంబాల పిల్లలు కూడా ఉన్నత స్థానాలకు చేరేలా అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతుల కల్పన జరుగుతున్నట్లు, విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి చేసుకొని బయటకు వెళ్లి బ్రతికేవిధంగా పాఠశాలలు తీర్చిదిద్దుతామన్నారు. పిల్లలు ఆకాశమే హద్దుగా ముందుకు వెళ్లాలని, చదువుపై దృష్టి పెట్టాలని అన్నారు. చదువు సమాజంలో గౌరవం, గుర్తింపు ఇస్తుందని అదనపు కలెక్టర్ అన్నారు. ఐటిడిఎ, భద్రాచలం పీవో బి. రాహుల్ మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు అన్ని విధాలా అభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టామని అన్నారు. ప్రైమరీ పిల్లలకు ఉద్దీపకం కార్యక్రమం చేపట్టామని, దీనికి సంబంధించి ఉద్దీపకం 1, 2 పుస్తకాలు మంత్రివర్యులు ఆవిష్కరించారని, ఉద్దీపకం– 3 పుస్తకాన్ని ఇప్పుడు ఆవిష్కరిస్తారని అన్నారు. పిల్లల చదువు తర్వాత ఉపాధి దిశగా గైడెన్స్ కి వారధి కార్యక్రమం చేపట్టనున్నట్లు పీవో తెలిపారు. పిల్లల చదువుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు అన్నారు.ఈ సందర్భంగా మంత్రి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఏదులాపురం మునిసిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, పీఆర్ ఇఇ మహేష్ బాబు, ఖమ్మం రూరల్ మండల తహసీలార్ వినయ్ చంద్ర రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ పరిశీలించిన బీజేపీ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మారుతి కిరణ్ బూనేటి



**వికారాబాద్, జూలై 29, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల::భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ మండల ప్రవాస్ అభియాన్ సందర్భంగా కుల్కచర్ల మండల కేంద్రంతో పాటు తిర్మలాపూర్, ఇప్పాయిపల్లి, కుసుమసముద్రం, గౌరిగడ్డ తండా,పుట్టపాడు,ఘనపూర్ గ్రామాల్లో బీజేపీ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మారుతి కిరణ్ బూనేటి ఓటరు జాబితా ప్రత్యేక పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లడుతూ అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా, ఓటరు నమోదు, సవరణలు, తొలగింపులు, చిరునామా మార్పులు తదితర ప్రక్రియలను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## గిరిజన నిరుద్యోగ యువతకు ఉచిత వృత్తి నైపుణ్య శిక్షణ...

### -ఆగస్టు 07లోగా దరఖాస్తు చేసుకోవాలి: ఐటీడీఏ పీవో బి. రాహుల్...

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 29, నేటి శుభోదయ :** గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలోని వైటీసీ శిక్షణా కేంద్రంలో ఉచిత వృత్తి నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు.18 నుంచి 33 సంవత్సరాల మధ్య వయస్సు గల ఎస్టీ యువతీ, యువకులకు ఈ శిక్షణ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం జావా, పైథాన్, స్పోకెన్ ఇంగ్లీష్ అండ్ సాఫ్ట్ స్కిల్స్, బ్యూటీషియన్,సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ టైలరింగ్ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.శిక్షణతో పాటు ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు, శిక్షణ పూర్తయిన అనంతరం ఎన్ఎస్‌డీసీ గుర్తింపు పొందిన సర్టిఫికెట్‌తో పాటు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామని వెల్లడించారు.ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 7లోపు తమ లగేజీతో నేరుగా వైటీసీ శిక్షణా కేంద్రానికి వచ్చి నమోదు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 7993102529 నంబర్‌కు మెసేజ్ పంపడం ద్వారా లేదా ఫోన్ చేసి సమాచారం పొందవచ్చని పేర్కొన్నారు.సీట్లు పరిమితంగా ఉన్నందున అర్హులైన గిరిజన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో



బి. రాహుల్ విజ్ఞప్తి చేశారు

## మీ పేరు ఎస్ఐఆర్ లో నమోదైందో లేదో ఇలా తెలుసుకోండి తహసిల్దార్ రాఘవేందర్ రెడ్డి



**మిడ్జిల్ ,29 జూలై, నేటి శుభోదయ :** మిడ్జిల్ మండల తహసిల్దార్ రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ మండల ప్రజలందరు ఒకసారి మీ ఓటర్ మ్యాపింగ్ పూర్తయ్యిందా లేదా అనేది తప్పకుండా చెక్ చేసుకోవాలన్నారు. మీ పేరు నమోదైందో లేదో తెలుసుకోవడానికి:ECI అని టైప్ చేసి, ఒక స్పేస్ ఇచ్చి మీ ఓటర్ ఐడి నంబర్ టైప్ చేసి 1950కి SMS పంపండి. ఉదాహరణ ECI ABC1234567 → 1950కి పంపండి.కొద్ది సేపట్లో రిప్లై మెసేజ్ వస్తుంది. దాని ద్వారా మీ మ్యాపింగ్ పూర్తయ్యిందా లేదా, ఆన్‌లైన్‌లో నమోదైందో లేదో తెలుసుకోవచ్చు. చివరి తేదీ వచ్చే వరకు వేచి ఉండకుండా, వెంటనే ఒకసారి చెక్ చేసుకోవాలని , అలాగే అంగన్వాడీ కేంద్రాల వద్ద గ్రామాల జి.పి.ఓ ,అంగన్వాడీ టీచర్లలను ఓటర్ల లకు అందరూ సహకరించాలని తెలిపారు.

## ఈ దేశంలోని యువత, విద్యార్థులపై కేంద్ర బీజేపీ ప్రభుత్వం చేస్తున్న దమనకాండను ప్రతిఘటించండి

- యువజన కాంగ్రెస్ శ్రేణులకు ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్ పిలుపు





**ఖమ్మం, జూలై 29, నేటి శుభోదయ :** జిల్లాలో యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసే కార్యక్రమాల్లో భాగంగా బుధవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజండ్ల సాయి కుమార్ అధ్యక్షతన జిల్లా యువజన కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఖమ్మం జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు, 20 మండలాల్లో గ్రామస్థాయి నుంచి యువజన కాంగ్రెస్ కమిటీల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత పటిష్ఠం చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.ఈ సందర్భంగా వేజండ్ల సాయికుమార్ మాట్లాడుతూ, కేంద్ర బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ఇప్పటివరకు ముందుండి పోరాడారని, ఇదే పోరాట స్ఫూర్తిని భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని తెలిపారు.దేశంలోని యువత, విద్యార్థుల గొంతును అణిచివేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న చర్యలను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువత లేవనెత్తుతున్న సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని, ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలని కోరారు.అదేవిధంగా, విద్యార్థి–యువజన ఉద్యమాలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణలోకి తీసుకుని వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేకపోతే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని వేజండ్ల సాయికుమార్ హెచ్చరించారు.యువత సమస్యల పరిష్కారం కోసం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం యువజన కాంగ్రెస్ నిరంతరం ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు ఈ కార్యక్రమం లో స్టేట్ సెక్రటరీ జెర్రిపోతుల అంజనీ కుమార్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ లు ఖలీల్, బాల గంగాధర్, కోటేష్, ఆదర్శ్ మరియు జిల్లా జనరల్ సెక్రటరీ లు కుక్కల మహేష్, బెల్లంకొండ శరత్ ఖమ్మం టౌన్ ప్రెసిడెంట్ శ్రావణ్, జిల్లా యువజనకాంగ్రెస్ నాయకులు బోడేపూడి రాజా, కొండూరి హృదయ్ కిరణ్ మరియు అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ లు అంబటి ఈశ్వర్, నితీష్ కుమార్ సన్నీ, ఖైసర్, ఫారుక్, జంగం రాజేష్ మరియు మండల అధ్యక్షులు జనప్రియ కుమార్, రామకృష్ణ, అలకుంట నరసింహారావు, రాకేష్, సతీష్, నిమ్మల నాగేశ్వరరావు, జిల్లా సోషల్ మీడియా కో–కో కోర్డినేటర్ పవన్ కుమార్ రాజు మరియు యువజన కాంగ్రెస్ నాయకులు యడ్లపల్లి తరుణ్, దినేష్, మల్లెలి గాంధీ తదితర యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్







**వికారాబాద్, జూలై 29, నేటి శుభోదయ :** వికారాబాద్: గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని వికారాబాద్ జిల్లా అనంత గిరిలోని పద్మనాభ స్వామి దేవాలయంలో నిర్వహించిన చిన్న జాతర (పెరుగు బసంతం) కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి దేవాలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన గడ్డం ప్రసాద్ కుమార్‌కు అర్చకులు వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులతో కలిసి ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.తదుపరి వికారాబాద్ పట్టణంలోని దత్తాత్రేయ కాలనీలో ఉన్న దత్తాత్రేయ స్వామి దేవాలయాన్ని సందర్శించిన గడ్డం ప్రసాద్ కుమార్, గడ్డం అనన్య స్వామివారి పూజల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

### : జిల్లా కలెక్టర్ అంకిత్

- జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో అధికారులకు ఆదేశాలు

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 29, నేటి శుభోదయ :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో జిల్లాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలు, ప్రమాదాలు అధికంగా నమోదవుతున్న బ్లాక్ స్పాట్ల పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రహదారులపై పశువుల సంచారం అధికంగా ఉండటం వల్ల, ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు . రహదారులపై పశువులను నిర్లక్ష్యంగా వదిలే యజమానులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అతివేగంగా వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు అప్పగించడం, సీటు బెల్టులు ధరించకపోవడం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు వినియోగించకపోవడం వంటి ఉల్లంఘనలను అరికట్టేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, కట్టుదిట్టమైన అమలు చర్యలు చేపట్టాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 42 బ్లాక్ స్పాట్లలో భద్రతా చర్యలకు సంబంధించిన పనులను వచ్చే నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. బ్లాక్ స్పాట్ల వద్ద హెచ్చరికలు, సూచిక బోర్డులు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన భద్రతా ప్రమాణాలు అమలు చేయాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా రహదారుల వెంట ఏర్పడిన గుంతలను తక్షణమే పూడ్చివేయాలని, రహదారుల ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించి వాహనదారులకు స్పష్టమైన దృశ్యమానత కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు.ప్రమాదాలు సంభవించినప్పుడు క్షతగాత్రులకు 'గోల్డెన్ అవర్'లో సకాలంలో వైద్య



సేవలు అందేలా బ్లాక్ స్పాట్లకు సమీపంలోని ఆసుపత్రులను మ్యాపింగ్ చేయాలని, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.జిల్లాలో జనవరి నుండి ఇప్పటివరకు 289 రోడ్డు ప్రమాద కేసులు నమోదయ్యాయని అధికారులు వివరించారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేసి నవీకరించాలని సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు వేణుగోపాల్, ఆర్ అండ్ బి ఈ ఈ నాగేశ్వరరావు, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ, జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, జిల్లా పంచాయతీ అధికారి అనూష సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి వేళ శాఖాంబరిగా భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ మహాలక్ష్మి అమ్మవారు



**మంథని, జూలై 29, నేటి శుభోదయ :** ఆషాడ శుద పౌర్ణమి ( గురు పౌర్ణమి ) పర్వదినమును పురస్కరించుకొని బుధవారం మంథని పట్టణంలోని శ్రీ మహాలక్ష్మీ దేవాలయంలో " శాఖాంబరి" ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మారుపాక ప్రశాంత్ శర్మ ఉదయం 4 గంటలకు అమ్మవారికి అభిషేకం, 6 గంటలకు అర్చన అనంతరము శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని శాఖాంబరిగా అలంకరించారు. అనంతరం ఉదయం 6 గంటలకు అమ్మవారు శాఖాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయంలో శ్రీ లలితా సహస్రనామ పారాయణం కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి 8 గంటల నుండి 9 గంటల వరకు ప్రత్యేక భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం పవళింపు సేవ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. దుర్గముడు అనే రాక్షసుని బారి నుండి సమస్త జీవకోటిని రక్షించుటకు శ్రీ ఆదిపరాశక్తి మాత శాఖాంబరిగా కీర్తించబడినదని శ్రీ దేవి భాగవతంలోని సప్త మస్కందములో తెలుపబడినది. ఆ దేవి అనుగ్రహించిన 9 అవతారంలలో శాకాంబరీ దేవి అవతారం ఒకటిగా పేర్కొనబడినది.

## కేశంపేట పోలీసుల ఘన విజయం..
## అంతర్రాష్ట్ర చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్

**కేశంపేట, జులై 29, నేటి శుభోదయ :** కేశంపేట పోలీసులు అంతర్రాష్ట్ర చైన్ స్నాచింగ్ ముఠాను అరెస్ట్ చేసి కీలక విజయాన్ని సాధించారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కేశంపేట, కడ్తాల్, కొత్తకోటతో పాటు మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో వరుసగా చైన్ స్నాచింగ్‌లు, మోటార్‌సైకిల్ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.పంజాబ్ రాష్ట్రానికి చెందిన సుఖ్‌దేవ్ సింగ్ (38), శంషేర్ సింగ్ (36), మన్‌ప్రీత్ సింగ్ (24)లను అరెస్ట్ చేసిన పోలీసులు వారి వద్ద నుంచి సుమారు 7 తులాల బంగారు గొలుసులు, మూడు మొబైల్ ఫోన్లు, ఒక మోటార్‌సైకిల్, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నారు.జూలై 25న కేశంపేట మండలం సంతాపూర్ గ్రామానికి చెందిన సోమరాజు బాలమ్మ మెడలోని 4 తులాల పుస్తెల తాడును, అదే రోజు కడ్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో మహిళ మెడలోని 3 తులాల పుస్తెల తాడును ఈ ముఠా లాక్కెళ్లింది. ఈ ఘటనలపై కేసులు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో నిందితులను కేశంపేట ఎక్స్ రోడ్డు సమీపంలో పట్టుకున్నారు.ఈ కేసును ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, డీసీపీ సిరిశా రాఘవేంద్ర, ఏసీపీ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో కేశంపేట పోలీసులు ఛేదించారు. సమర్థవంతంగా పనిచేసిన పోలీసు బృందాన్ని అధికారులు అభినందించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే పోలీసులకు అందించాలని సూచించారు.




## మియాపూర్ డివిజన్ ప్రశాంత్ నగర్ లో అక్రమ చర్చి నిర్మాణం పై అధికారుల కి ఫిర్యాదు

**మియాపూర్ , జూలై 29, నేటి శుభోదయ :** మియాపూర్ ప్రశాంత్ నగర్ ప్రాంగణం లోని సర్వే నెంబర్ 100లో అక్రమంగా చర్చ్ నిర్మిస్తున్నారని తెలిసి కొన్న స్థానిక బజరంగ్ దళ్ కార్యకర్తలు వెంటనే స్పందించారు. ప్రజలు నివసించే ఇళ్ళ మధ్య చర్చిలు నిర్మించి మైకులు పెట్టి సౌండ్ పొల్యూషన్ కి దారి తీస్తుందని కాబట్టి మన్నె సోను, కూకట్‌పల్లి విశ్వకర్మ జిల్లా విద్యార్థి ప్రముఖ్, బజరంగ్ దళ్ కార్యకర్తలు మన్యం (బి జె వై ఎం) ,శ్రీను, కృష్ణ, భార్గవ్, సింహ, నవీన్ లు ప్రశాంత్ నగర్ లో అక్రమంగా నిర్మిస్తున్న చర్చ్ పై మియాపూర్ పోలీస్ స్టేషన్, మున్సిపల్ ఆఫీస్,హెచ్ ఎం డి ఏ ,మరియు ఎమ్మార్వో ఆఫీస్‌లలో ఫిర్యాదు చేశారు.దీనిపై ఎమ్మార్వో స్పందించి, తక్షణమే ఇన్స్పెక్షన్‌కు పంపిస్తామని, విచారించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## విద్యార్థి దశ నుండే పిల్లలకు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను అలవాటు చేయాలి : ఉప్పల్ ఎస్ఐ చిరంజీవి

**ఉప్పల్, జూలై 29, నేటి శుభోదయ :**
ప్రభుత్వ విద్యా రంగంలో విద్యార్థులకు అత్యుత్తమ విద్యతో పావిద్యార్థి దశ నుండే పిల్లలకు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను అలవాటు చేయడం వల్ల వారి భవిష్యత్తు బంగారుమయం అవుతుందని ఉప్పల్ ఎస్ఐ చిరంజీవి పిలుపునిచ్చారు. హైదరాబాద్ ఉప్పల్ బాగాయత్ లోని శ్రీ చైతన్య స్కూల్ లో ఏర్పాటు చేసిన ఇన్వెస్టిట్యూర్ సేరెమనీ కార్యక్రమానికి ఎస్ఐ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం నూతన బాధ్యతలు స్వీకరించిన చిన్నారులను చిరంజీవి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యా సంస్థ లలో చదువుతో పాటు సాంస్కృతిక అంశాలు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, క్రీడలు,బాధ్యతయుతంగా మెలగడం, టీం వర్క్ తోపాటు పిల్లల్లో ఆత్మవిశ్వాసం నెలకొల్పేలా కృషి చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## ఉమ్మడి మియాపూర్ డివిజన్ సర్ కార్యక్రమం లో పాల్గొన్న బి ఎస్ ఎన్ కిరణ్ యాదవ్



**మియాపూర్ , జూలై 29, నేటి శుభోదయ :** బుధవారం రోజు ఉమ్మడి మియాపూర్ డివిజన్ పరిధిలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ బీఎస్ఎన్ కిరణ్ యాదవ్, బి ఆర్ ఎస్ వి శేర్లింగంపల్లి నియోజకవర్గం నాయకులు రాజు వడ్డెరాజ్ , గంగాధర్ లు పాల్గొని వివిధ ప్రాంతాల్లో సర్ కార్యక్రమం జరుగుతున్న తీరును పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా న్యూ కాలనీ, సెయింట్ రీటా స్కూల్, ప్రగతి ఎన్‌క్లేవ్, పలు ప్రాంతాల్లో పర్యటించి, బీఎల్ఓ అధికారులతో కలిసి ఓటర్ల వివరాల పరిశీలన, ఎన్యుమరేషన్ ఫారాల ప్రక్రియ తదితర అంశాలను పరిశీలించడం జరిగింది. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు సక్రమంగా నమోదయ్యేలా ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఎలాంటి తప్పులు లేకుండా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవడం జరిగింది.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనది. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా నమోదు చేసుకుని, ఓటరు జాబితాలో తమ వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేయడం జరిగింది

## గురు పౌర్ణమి వేళ మంథని శిరిడి సాయిబాబా ఆలయంలో భక్తి వెల్లువ

**మంథని, జూలై-29, నేటి శుభోదయ :**
"గురుర్ బ్రహ్మ గురుర్ విష్ణుః గురుర్దేవో మహేశ్వరః... గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః" అనే వేదవాక్యాన్ని సార్థకం చేస్తూ గురు పౌర్ణమి సందర్భంగా మంథని పట్టణంలోని శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయం ఆధ్యాత్మిక కాంతులతో వెలిగిపోయింది. కలియుగ ప్రత్యక్ష దైవమైన సద్గురు శ్రీ షిరిడి సాయినాథుని ఆశీస్సులు పొందేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ పవిత్ర గురు పౌర్ణమి రోజున భక్తులకు అరుదైన మహాభాగ్యాన్ని కల్పించారు. సాయినాథుని పవిత్ర గద్దెపైకి స్వయంగా చేరి ఆయన దివ్య పాదాలను దర్శించుకునే అవకాశం కల్పించడంతో భక్తులు ఆనందభాష్పాలతో గురుదక్షిణ సమర్పించారు. గురు పాదసేవ ద్వారా జన్మజన్మల పాపాలు నశించి, సద్గురువు అనుగ్రహం లభిస్తుందని విశ్వసించే భక్తులకు ఇది జీవితంలో మరపురాని ఆధ్యాత్మిక అనుభూతిగా నిలిచిందని ఆలయ కమిటీ అధ్యక్షురాలు మహావాది జలజ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు పనకంటి మురళీధర్, ఆలయ అర్చకులు రామడుగు సాయి శ్రీనివాస్ లు తెలిపారు.సాయినాథుని దివ్య చరితం...శ్రీ షిరిడి సాయిబాబా కుల, మత, భేదాలకు అతీతంగా ప్రేమ, కరుణ, సేవ, సమానత్వాన్ని బోధించిన మహాయోగి. "శ్రద్ధా – సబూరి" అనే రెండు మహామంత్రాలను ప్రపంచానికి అందించిన సద్గురువు. బాధలో ఉన్నవారికి ధైర్యం, నిరాశలో ఉన్నవారికి ఆశ, ఆకలితో ఉన్నవారికి అన్నం, దిక్కులేని వారికి దైవ దిక్సూచి చూపించిన దయామయుడు సాయినాథుడు. "అందరిలో దేవుడున్నాడు – అందరినీ ప్రేమించండి, సేవించండి" అనే ఆయన సందేశం నేటికీ కోట్లాది మంది భక్తులకు జీవన మార్గదర్శిగా నిలిచింది. సాయినాథుని ఆశ్రయించిన వారిని ఆయన ఎప్పుడూ విడిచిపెట్టరని భక్తుల విశ్వాసం.అన్నదానం మహాదానాలలో మహోన్నతమైనదిగురు పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు సాయి ప్రసాదాన్ని స్వీకరించారు.★"అన్నదానం మహాదానం"★గా భావిస్తారు. ఆకలితో ఉన్న జీవికి అన్నం పెట్టడం అంటే సాక్షాత్తు పరమాత్ముని సేవ చేసినట్లేనని శాస్త్రాలు చెబుతున్నాయి. ఆలయానికి విచ్చేసిన ప్రతి భక్తునికి ప్రేమతో మహాప్రసాదాన్ని అందించి సాయిసేవను చాటారు. అన్నదాన సేవలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సాయినాథుని అనంత కృప లభించాలని భక్తులు ప్రార్థించారు.ఈ పుణ్యకార్యాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఆలయ అర్చకులు రామడుగు సాయి శ్రీనివాస్, ఆలయ పాలకవర్గ సభ్యులకు సాయిభక్తులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. గురు పౌర్ణమి రోజున భక్తులకు ఇంతటి అరుదైన పుణ్యఫలాన్ని అందించడం గొప్ప సేవ అని కొనియాడారు.సాయంత్రం 7 గంటలకు యోగిరాజ శతకం పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం సాయినామ సంకీర్తనలతో భజన కార్యక్రమం నిర్వహించగా ఆలయ ప్రాంగణమంతా "ఓం శ్రీ సాయిరామ్" నామస్మరణతో మారుమోగింది. చివరగా జరిగిన శేజ హారతిలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సాయినాథుని కృపాకటాక్షాలను ప్రార్థించారు.గురు పౌర్ణమి సందర్భంగా సాయినాథుని సన్నిధిలో గడిపిన ప్రతి క్షణం భక్తుల జీవితాల్లో ఆధ్యాత్మిక వెలుగులు నింపింది. సద్గురువు ఆశీస్సులతో లోకక్షేమం, సర్వజన సుఖశాంతులు, ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, ఆనందం వెల్లివిరియాలని భక్తులు ప్రార్థిస్తూ గురు మహోత్సవాన్ని భక్తి పారవశ్యంతో ముగించారు."సబ్‌కా మాలిక్ ఏక్... శ్రద్ధా – సబూరి... ఓం శ్రీ సాయిరామ్."




## మైలారంలో భారీ వర్షానికి కూలిన ఇంటి గోడ.. బాధితులకు తక్షణ పునరావాసం



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, జూలై 29, నేటి శుభోదయ :** సిరికొండ మండలం మైలారం గ్రామంలో కురిసిన భారీ వర్షాల కారణముగా నివాస గృహం గోడ కూలి తీవ్ర నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన బొంబాయి గంగారం అనే వ్యక్తికి చెందిన ఇంటి గోడ వర్ష ధాటికి ఒక్కసారిగా కూలిపోయింది.ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ సర్దార్ సదానంద్ వెంటనే స్పందించి, ఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితులకు ధైర్యం చెప్పిన సర్పంచ్, వర్షాల తీవ్రత దృష్ట్యా ప్రజలందరూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.అనంతరం, ఇల్లు దెబ్బతిన్న బాధిత కుటుంబానికి గ్రామపంచాయతీ కార్యాలయంలో తాత్కాలిక పునరావాసం కల్పించి, అవసరమైన సాయం అందించేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## గురుపౌర్ణమి సందర్భంగా జనప్రియ లో ప్రత్యేక పూజలు అన్నదాన కార్యక్రమం.. పాల్గొన్న బోయిని అనుషా మహేష్ యాదవ్



**శేరిలింగంపల్లి , జూలై 29, నేటి శుభోదయ :** గురుపౌర్ణమి సందర్భంగా జనప్రియ అపార్ట్మెంట్ ఫేజ్–1లో నిర్వహించిన ప్రత్యేక గురుపూజా కార్యక్రమం మరియు అన్నదాన కార్యక్రమంలో హఫీజ్‌పేట్ బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ శ్రీమతి బోయిని అనుషా మహేష్ యాదవ్ పాల్గొన్నారు.అనంతరం మియాపూర్‌లోని శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని సాయిబాబా ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని ప్రార్థించారు.కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు ప్రవీణ్ , పారునంది నాగులు , హరి, సుధీర్, శ్రీనివాస్ యాదవ్, రామారావు, మృదుల , నాయకులు శ్రీధర్ రావు, రవి గౌడ్, జగన్ , భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గురుపౌర్ణమి ఆధ్యాత్మిక విలువలను, గురువుల గొప్పతనాన్ని గుర్తు చేసుకుంటూ సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బోయిని అనుషా మహేష్ యాదవ్ పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

- కండువా కప్పి పార్టీలో ఆహ్వానించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, డిసిసి అధ్యక్షులు మహమ్మద్ అయుబ్



**వరంగల్ , జూలై 29, నేటి శుభోదయ :** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు, కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ అయుబ్ అన్నారు. వరంగల్ నగరం పరిధిలోని 14వ డివిజన్ ఎస్ఆర్ నగర్,బాలాజీ నగర్ కు చెందిన సుమారు 250 మంది వివిధ పార్టీల కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారికి ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షులు,కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నచ్చి నియోజకవర్గ వ్యాప్తంగా పెద్దఎత్తున బీఆర్ఎస్, బీజేపీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు జరుగుతున్నాయన్నారు.పార్టీలో చేరిన కార్యకర్తలందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు.ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను గడపగడపకి తీసుకెళ్లాలని సూచించారు.ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్న ప్రతిపక్ష నాయకుల మాటలకు తగిన రీతిలో జవాబు చెప్పాలన్నారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర రావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలువేరు శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ తూర్పాటి సులోచన–సారయ్య డివిజన్ అధ్యక్షుడు మమ్మద్ ఇంతియాజ్ ,3వ డివిజన్ అధ్యక్షులు జన్ను కరుణాకర్, వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ సారంగపాణి,ముచ్చర్ల స్టాలిన్, అంబాల సత్యం పసునూరి సరిత పల్లపు రాజేశ్వరి భాగ్య సరూప నరేష్ దామెర లేనిన్ స్టార్ లేదన్న అరవిందు తప్పెట్ల నరసయ్య అబ్బర బోయిన నితిన్ కొంకటి అఖిల్ దామెర అంబేద్కర్ అబ్బర బోయిన పవన్ పల్లపు నరేందర్ ఇనుగాల అరవిందు పల్లపు రాజేశ్వరి అమ్మ రామ సిలుముల సంధ్య ప్రసాద్ గోవిందు సాంబయ్య బానోతు నరేష్ పుట్ట రాకేష్ బండి రజిత పన్నాటి కోమల గోలి అనిత బత్తుల చిరంజీవి పగిండ్ల విజయ్ అంకం రాధమ్మ కుడికాల నిర్మల తో డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

## రోడ్డుపై వరి నాట్లు వేసి గ్రామస్థుల వినూత్న నిరసన





**షాబాద్, జూలై 29, నేటి శుభోదయ :** షాబాద్ మండల పరిధిలోని వెంకమ్మగూడ గ్రామంలో ప్రధాన రహదారి దుస్థితిపై గ్రామస్తులు వినూత్న నిరసన చేపట్టారు. రాత్రి కురిసిన భారీ వర్షానికి రహదారి మొత్తం వర్షపు నీటితో జలమయం కావడంతో, నిలిచిన నీటిలో వరి నాట్లు వేసి తమ నిరసనను తెలిపారు.రోడ్డుపై నీరు నిలవడంతో వాహనదారులు, విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, కాల్వలు పూడిపోవడం వల్లే సమస్య తీవ్రంగా మారిందని తెలిపారు. గతంలో మంజూరైన రోడ్డు నిర్మాణ నిధులు రద్దు కావడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు.వెంటనే సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులతో పాటు శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## సన్న బియ్యం అర్హులకే అందేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ...

- అదనపు రెవెన్యూ కలెక్టర్ శ్రీరాములు





**మంథని/పెద్దపల్లి, జూలై 29, నేటి శుభోదయ :** జిల్లాలో ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేస్తున్న సన్న బియ్యం అర్హులైన బీపీఎల్ కుటుంబాలు, విద్యాసంస్థలకు మాత్రమే చేరేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని అదనపు రెవెన్యూ కలెక్టర్ బి. శ్రీరాములు అధికారులను ఆదేశించారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పౌర సరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ సమావేశంలో అదనపు కలెక్టర్ పాల్గొని సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ, ప్రభుత్వం 2025 ఏప్రిల్ 1 నుంచి అన్ని చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేపట్టిందని తెలిపారు. ఆహార భద్రతా కార్డులోని ప్రతి వ్యక్తికి నెలకు 6 కిలోల సన్న బియ్యం, అంత్యోదయ కార్డుకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డుకు 10 కిలోల బియ్యం ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.జిల్లాలోని 14 మండలాల పరిధిలో 410 చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ జరుగుతోందని తెలిపారు. బియ్యం పంపిణీలో ఎలాంటి అక్రమాలు, బ్లాక్ మార్కెటింగ్, రీసైక్లింగ్ జరగకుండా నిరంతర తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో మొత్తం 2,46,981 రేషన్ కార్డుల ద్వారా 7,17,898 మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందుతున్నారని, కొత్తగా 30,909 రేషన్ కార్డులు మంజూరు చేసి 88,357 మంది లబ్ధిదారులను చేర్చినట్లు తెలిపారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మూడు నెలల కోటా కింద జిల్లాకు 13,645.968 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించినట్లు వెల్లడించారు.జిల్లాలో ప్రస్తుతం 43 ఫెయిర్ ప్రైస్ షాపుల డీలర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి అవసరమైన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.ప్రతి రేషన్ కార్డుదారుడి eKYC ప్రక్రియను జూలై 31లోపు శాతం 100 పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 7,16,498 మంది లబ్ధిదారుల్లో 5,89,738 మంది (82.31 శాతం) ఇప్పటికే eKYC పూర్తి చేసుకున్నారని, మిగిలిన వారందరూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలో గుర్తించిన 7,490 మంది అనుమానిత లబ్ధిదారుల్లో 4,894 మంది ధృవీకరణ పూర్తయిందని, మిగిలిన వారి ధృవీకరణను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు జిల్లాలో నమోదైన 62 కేసులపై సమీక్ష నిర్వహించిన అదనపు కలెక్టర్, ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన 31 కేసుల్లో 579.80 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుని రూ. 25.89 లక్షల విలువైన నిల్వలను సీజ్ చేసినట్లు, ఎల్పీజీకి సంబంధించిన 31 కేసుల్లో 45 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో 1,18,953 అర్హ కుటుంబాలకు ఇప్పటివరకు 4,73,691 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసి, రూ.1,403.45 లక్షల సబ్సిడీ అందించినట్లు అధికారులు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రవీందర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఓటర్ల నమోదుపై రాజకీయ పార్టీలు సోలిపేట చొరవ చూపాలి

### - ఈఆర్ శ్రీనివాస్ రెడ్డి





**రాజేంద్ర నగర్, జూలై 29, నేటి శుభోదయ :** రోజులే మిగిలి ఉన్న నేపథ్యంలో ప్రతి అర్హుడైన ఓటరు తప్పనిసరిగా నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీలు చైతన్యం కల్పించాలని నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కోరారు.కిస్మత్పూర్లోని రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో ఆయన తెలిపారు.

## ఖమ్మం ఆటోమొబైల్ మార్కెట్ లోకి టాటా సియారా ఈవి

**ఖమ్మం, నేటి శుభోదయ :** సఖమ్మం లో టాటా మోటార్స్ వారు తమ సక్సెస్ మోడల్ అయిన టాటా సియారా నుండి కొత్తగా టాటా సియారా ఎలక్ట్రిక్ కార్ ను తమ అధీకృత డీలర్ అయిన వెంకటరమణ మోటార్స్ ద్వారా ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య చేతులమీదుగా విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భం గా ముఖ్య అతిధి ఖమ్మం మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ ప్రతిఒక్కరు డ్రైవింగ్ చేసేటప్పుడు సీట్ బెల్ట్ తప్పక ధరించాలని కోరారు. మన ఖమ్మం ప్రజలు టాక్స్ లు సకాలం లో కట్టి ఖమ్మం అభివృద్ధికి సహకరించాలని కోరారు.ఈ ఈవీ వాహనాలు వాడటం వల్ల పొల్యూషన్స్ కూడా చాల వరకు నగరం లో తగ్గుతున్నది అని అన్నారు.వివిసి గ్రూప్ చైర్మన్ అండ్ ఎండీ వంకాయలపాటి వెంకట రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మా ఆహ్వానాన్ని మన్నించి మాకు టైం కేటాయించి వచ్చిన ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య కి ధన్యవాదములు చెబుతూ ఈ టాటా సియారా ప్యాసింజర్ వేరియంట్ లలో మార్కెట్ లో సేల్స్ పరంగా ఒక ట్రెండ్ సృష్టించినది అని అన్నారు. అలాగే ఈ టాటా సియారా EV కూడా కస్టమర్ల ఆదరణ పొందుతుంది అని నమ్ముతున్నాము అని అన్నారు .ఈ టాటా సియారా EV 63 KWH అండ్ 75KWH ల బ్యాటరీ సామర్థ్యం తో , ఒకసారి ఛార్జ్ చేస్తే సుమారు 665 కిలోమీటర్లు రేంజ్ వస్తుంది అని అన్నారు, ఒకసారి 120KWH ఛార్జింగ్ ఛార్జ్ చేస్తే 20 నిమిషాలలో 80 శాతం వరకు ఛార్జ్ అవుతుంది అని అన్నారు. ముఖ్యం గా బ్యాటరీ పై మొదటి కస్టమర్ కు 15 సంవత్సరాల వారంటీ లభ్యమవుతుంది అని అన్నారు. బూట్ స్పేస్ 622 కెపాసిటితో , ట్రిపుల్ స్క్రీన్ డాష్ బోర్డు 12 .30 అంగుళాల వెడల్పు కలిగిన సెంటర్ మరియు ప్యాసింజెర్ డాష్ బోర్డు కలిగి , డాల్ బీ ఆటోమోస్ , 12 JBL స్పీకర్ లు కలిగి , సెఫ్టీ పరంగా 06 ఎయిర్ బాగ్స్ తో , 540 డిగ్రీ అండర్ ఫ్లోర్ కెమరాతో , QWD అనగా క్వాడ్ వీల్ డ్రైవ్ టెక్నాలజీ తో లభిస్తుంది అని అన్నారు. ఈ టాటా సియారా EV EX.Shw:Rs 18 .79 లక్షల నుండి ప్రారంభమై 05 వేరియంట్ లలో లభ్య మవుతుంది అని అన్నారు.ఈ సందర్భముగా మా వెంకటరమణ మోటార్స్ టాటా కస్టమర్ ల కొరకు క్విక్ సర్వీస్ కూడా మా అన్ని సర్వీస్ సెంటర్ లలో లభ్యమవుతుంది అని , ప్రీమియం కస్టమర్ ల కొరకు సెపరేట్ బే లను కూడా ఏర్పాటు చేయడం జరిగింది అని చెప్పారు. ఈ అవకాశాన్ని మా వెంకటరమణ కస్టమర్లు సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాము అని అన్నారు.ఈ కార్యక్రమములో సంస్థ డైరెక్టర్స్ విశాల్ మరియు సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.





Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

## గోవిందాపురంలో ఐకెపి కార్యాలయ భవనానికి శంకుస్థాపన

- గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నాం - సర్పంచ్ మందా కరుణ



**బోనకల్, జులై 29, నేటి శుభోదయ :** బోనకల్ మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామంలోని బీసీ కాలనీ–ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించనున్న ఐకెపి (ఇందిరా క్రాంతి పథం) కార్యాలయ భవనానికి బుధవారం గ్రామ సర్పంచ్ మందా కరుణ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మందా కరుణ మాట్లాడుతూ, గోవిందాపురం ఎల్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. గ్రామానికి ఐకెపి కార్యాలయ భవనం మంజూరు కావడం ఆనందదాయకమని పేర్కొన్నారు. భవనం నిర్మాణం పూర్తయిన అనంతరం మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు ఈ భవనాన్ని సద్వినియోగం చేసుకుని తమ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కారంగుల చంద్రయ్య, పంచాయతీరాజ్ ఏఈ అశోక్, పంచాయతీ కార్యదర్శి కే. మురళి, వార్డు సభ్యులు ముత్తారపు రవి, జెట్టం వీరబాబు, కళ్యాణపు నాగేశ్వరరావు, షేక్ సైదా, మాజీ ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత, మాజీ జెడ్పీటీసీ, బోనకల్ ఉపసర్పంచ్ బానోతు కొండ, మాజీ సర్పంచ్ బాబు, మహిళా సంఘాల ప్రతినిధులు శాంతి, కరుణ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కబడ్దార్..! నేను కాంగ్రెస్ కార్యకర్తనే... ఎప్పటికీ కాంగ్రెస్‌లోనే ఉంటాను

- డీఎంఎస్ఎస్‌కు రాజకీయ రంగు పులమొద్దు
- అసత్య ప్రచారాన్ని సహించం
- ప్రదాన కార్యదర్శి పసుపులేటి శశాంక్



**సికింద్రాబాద్, జులై 29, నేటి శుభోదయ :** డెక్కన్ మానవ సేవా సమితి (డీఎంఎస్ఎస్)తో తన అనుబంధంపై జరుగుతున్న తప్పుడు, దురుద్దేశపూర్వక ప్రచారాన్ని టీపీసీసీ రాష్ట్ర లీగల్ కోఆర్డినేటర్, ఏఐపీసీ తెలంగాణ ఎంఎస్ఎంఈ రాష్ట్ర అధ్యక్షుడు పసుపులేటి శశాంక్ తీవ్రంగా ఖండించారు. సికింద్రాబాద్ లో బుధవారం ఈర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ నిన్న, నేడు, రేపు ఎప్పుడూ కూడా భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తనేనని తెలిపారు. నా రాజకీయ జీవితం కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకే అంకితం. డెక్కన్ మానవ సేవా సమితి రాజకీయాలకు అతీతమైన సేవా సంస్థ అని దానికి రాజకీయ రంగు పులమడం మానుకోవాలని హితవు పలికారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని విశ్వసిస్తూ, ఆయన ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేస్తున్న యువ నాయకుడినని, నియోజకవర్గ ఇంచార్జ్ డా. కోటా నీలిమ నాయకత్వం, మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం పనిచేస్తున్నానని పేర్కొన్నారు. 1926లో స్థాపించిన డెక్కన్ మానవ సేవా సమితి (డీఎంఎస్ఎస్) పూర్తిగా రాజకీయాలకు అతీతమైన సామాజిక సేవా సంస్థ అని శతాబ్దకాలంగా ప్రజాసేవ, ధార్మిక సేవ, సామాజిక సామరస్యానికి ప్రతీకగా నిలిచిందని చెప్పారు. శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల మహోత్సవాల నిర్వహణలో డీఎంఎస్ఎస్ కీలక పాత్ర పోషిస్తూ లక్షలాది మంది భక్తులకు సేవలందిస్తోందని, తెలంగాణ ప్రభుత్వ సంపూర్ణ సహకారంతో ప్రతి ఏడాది బోనాల మహోత్సవాలు విజయవంతంగా నిర్వహించబడుతున్నాయని ఇందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు వెల్లడించారు. ఆరు నుంచి ఏడు దశాబ్దాలుగా తమ కుటుంబం డీఎంఎస్ఎస్ సంఘ సేవలో నిమగ్నమై ఉన్నదని, ఈ సంఘంలో పార్టీలకతీతంగా అన్ని వర్గాలు ప్రజలు భాగమై సేవలు అందిస్తారని, ప్రతి ఏడాది నూతన అధ్యక్షుడిని ఎన్నుకోవడం జరుగుతుందని అందులో బాగంగా ఈ ఏడాది ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను మెజార్టీ అభిప్రాయం మేరకు అధ్యక్షుడిగా ఎన్నుకోవడం, తనకు ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించడం జరిగింది తప్పితే ఇందులో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదని వివరించారు. తమ కుటుంబానికి చెందిన దివంగత సీలం రాందాస్ సనత్‌నగర్ తొలి ఎమ్మెల్యేగా, మాజీ హుడా చైర్మన్గా ప్రజాసేవలో విశిష్ట సేవలందించడంతో పాటు డీఎంఎస్ఎస్ అభివృద్ధికి జీవితాంతం కృషి చేశారని గుర్తు చేశారు. అదేవిధంగా వారి తనయుడు రాంగోపాల్‌పేట్ మాజీ కార్పొరేటర్, మాజీ టీపీసీసీ కార్యదర్శిగా దివంగత సీలం ప్రభాకర్ కాంగ్రెస్ పార్టీతో పాటు డీఎంఎస్ఎస్, ఉజ్జయిని మహంకాళి దేవస్థాన సేవలో కీలక పాత్ర పోషించారని తెలిపారు.డీఎంఎస్ఎస్ చరిత్రలో అనేక మంది ప్రజాప్రతినిధులు, సామాజిక ప్రముఖులు సేవలందించారని శశాంక్ గుర్తుచేశారు. శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి సేవకు, నా రాజకీయ జీవితం భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి అంకితమని స్పష్టం చేశారు.

## నిజామాబాదు రూరల్ పోలీస్ స్టేషన్ ను వార్షిక తనిఖీలు చేసిన పోలీస్ కమీషనర్

- ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించడంలో ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాలి
- ఫిర్యాదు వచ్చిన వెంటనే త్వరితగతిన స్పందించాలి
- ఇన్వెస్ట్రిగేషన్ నందు నూతన టెక్నాలజీ పద్ధతులను ఉపయోగించాలి నిఘా వ్యవస్థను పటిష్ట పరచాలి



**నిజామాబాద్, జులై 29, నేటి శుభోదయ :** బుధవారం నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాదు రూరల్ పోలీస్ స్టేషన్‌ను నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య వార్షిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ గౌరవ వందనం స్వీకరించి, మొక్కని నాటరు.స్టేషన్‌లోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు.స్టేషన్‌లో ఉన్న కిట్ ఆర్టికల్స్,భద్రతా పరికరాలు,ఆయుధాల నిర్వహణ,రికార్డుల సంరక్షణ తదితర అంశాలను పరిశీలించి వాటి నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు.రిసెప్షన్ సెంటర్‌ను సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న రిజిస్టర్లు,ఫిర్యాదుల నమోదు విధానం,ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని గౌరవంతో స్వాగతించి,వారి సమస్యలను ఓర్పుతో విని వెంటనే స్పందించే విధంగా సిబ్బంది వ్యవహరించాలని సూచించారు.అన్ని రకాల రికార్డులను పరిశీలించిన కమిషనర్ కేసుల నమోదు,పెండింగ్ కేసుల దర్యాప్తు,బీట్ డ్యూటీ వ్యవస్థ,రౌడీషీటర్లు,నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై పర్యవేక్షణ వంటి అంశాలను సమగ్రంగా తనిఖీ చేశారు.కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.స్టేషన్‌లో అమలవుతున్న “5 ఎస్ విధానం” అమలు తీరును సమీక్షించి,ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించడంలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మహిళలు, వృద్ధులు, అత్యవసర సహాయం కోసం వచ్చే ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకొని స్పందించాలని తెలిపారు.స్టేషన్ పరిసరాల పరిశుభ్రత,రికార్డుల డిజిటల్ నిర్వహణ,సిబ్బంది హాజరు,డ్యూటీ విధానాలు తదితర అంశాలపై పోలీస్ కమిషనర్ ఆరా తీశారు.ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెరిగేలా క్రమశిక్షణతో,పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు.అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల చేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని,ప్రతి కేసులో నాణ్యమైన,ఇన్వెస్టిగేషన్ చేయాలని సబ్ ఇన్స్పెక్టర్ కు సూచనలు చేశారు.ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాల జరుగుతున్నాయని,సైబర్ క్రైమ్స్ గురించి వివిధ పాఠశాలలు,కళాశాలలో సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు.నిజామాబాదు రూరల్ పోలీస్ స్టేషన్ సరిహద్దులో ఉన్నటువంటి అన్నీ ప్రధాన రహదారులపై నిఘా పటిష్టపరిచాలని అన్నారు.ప్రతి రోజు ట్రాఫిక్ సమస్య అధిగమించడానికి ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ చేయాలని సూచించారు.అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలు సూచనలు చేశారు.సులభ మార్గంలో అధిక డబ్బులు సంపాధించాలనే అత్యాశతో యువత ఆన్లైన్ బెట్టింగ్స్ ఆన్లైన్ గేమ్స్ ఆడుతూ,సైబర్ మోసగాళ్ళ చేతిలో చిక్కి డబ్బులు కోల్పోతూ అప్పులు చేసి,చేసిన అప్పులను తీర్చలేక తనువును చాలిస్తున్నారని అన్నారు.గేమింగ్ యాప్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.డ్రగ్స్ నియంత్రణ కోసము యువతను ఎల్లప్పుడూ చైతన్యవంతులను చేయాలని,అన్ని గ్రామాలలో డ్రగ్స్ వాడకం నిషేధము అని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు.సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ.... అధికారులు,సిబ్బంది 24X7 తమ హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలని,దూర ప్రాంతాల నుండి ప్రయాణాలకు దూరంగా ఉండాలని, సిబ్బంది ప్రతి ఆరు నెలలకు ఒకసారి తమ హెల్త్ చెకప్ చేయించుకోవాలని,ముఖ్యంగా బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు.ట్రాఫిక్ రూల్స్ ను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు.ఈ తనిఖీలో నిజామాబాదు ఎ.సి.పి బి. ప్రకాష్ యాదవ్,సి.సి.ఆర్.బి ఎ.సి.పి గురు నాయుడు,నిజామాబాదు రూరల్ ఎస్.హెచ్.ఓ సి.హెచ్.శ్రీనివాస్,ఎమ్.డి షరీఫ్,ఎ.ఆనంద్ సాగర్,ఎ.మహేష్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కిస్మత్‌పూర్ శ్రీ సాయి గణపతి దేవాలయంలో గురు పౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్ర నగర్, జూలై 29, నేటి శుభోదయ :** గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని కిస్మత్‌పూర్ పరిధిలోని సాయిబాబా నగర్ కాలనీలోని శ్రీ సాయి గణపతి దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక వేడుకలకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందించి, వేద ఆశీర్వచనాలు అందజేశారు.ఈ పవిత్రమైన రోజున ఆయన స్థానిక ప్రజలకు,భక్తులకు గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు,స్థానిక నాయకులు,కాలనీ వాసులు,విశేష సంఖ్యలో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

## పేదల కాలనీ రోడ్డుపై కన్నేసిన బడా నిర్మాణ సంస్థ..?



**రాజేంద్రనగర్, జూలై 29, నేటి శుభోదయ :** గండిపేట మండలం పుప్పాలగూడ నెమలి నగర్ రాజీవ్ గృహకల్ప కాలనీలోని ప్రభుత్వ సీసీ రోడ్డును ఏఎస్బీఎల్ నిర్మాణ సంస్థ ధ్వంసం చేసి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తోందని సీపీఎం గండిపేట మండల కమిటీసభ్యుడు జి.నాగేష్ గౌడ్ ఆరోపించారు.పేదల కోసం నిర్మించిన ప్రభుత్వ రోడ్డును బహుళ అంతస్తుల భవన నిర్మాణానికి అడ్డుగా ఉందనే కారణంతో ధ్వంసం చేశారని ఆయన విమర్శించారు.కాలనీవాసులు అడ్డుకోవడంతో బెదిరింపులకు పాల్పడుతూ ప్రహరీ గోడ నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.ఈ విషయంపై జీహెచ్ఎంసీ,రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.వెంటనే అధికారులు జోక్యం చేసుకుని ప్రభుత్వ రోడ్డును పరిరక్షించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ ఐ వెంకటేష్ కు సన్మానం



**రాజేంద్రనగర్, జూలై 29, నేటి శుభోదయ :** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ లో నూతనంగా పదవీ బాధ్యతలు తీసుకున్న వెంకటేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలకడం జరిగింది.అదేవిధంగా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ లో పనిచేసిన ముత్తు యాదవ్ కు వీడ్కోలు పలకడం జరిగింది.ఈ కార్యక్రమంలో గోల్కొండ గోషామహల్ జిల్లా ఇన్చార్జ్ శ్రీధర్,దర్గా ఖలీజ్ ఖాన్ కార్పొరేటర్,అస్లంబిన్అహ్మద్,ధీరజ్ యాదవ్ లు తదితరులు పాల్గొన్నారు.